## కాంగ్రెస్ పాలనలో రైతులకు దగా..

- రాష్ట్రంలో కృత్రిమ విద్యుత్, నీటి కొరత
- ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎంఎల్ఏ సండ్ర వెంకటవీరయ్య
- ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు
- వ్యవసాయానికి విద్యుత్ సరఫరా, ఎండిన పంటలకు పరిహారంపై తక్షణ శ్వేతపత్రం విడుదల చేయాలి

21 లో







# మనం ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

www.manamepaper.com | శనివారం | 17 | అక్టోబర్ | 2026 | పేజీలు : 21


# యాసంగిలో వరిసాగు చేయొద్దు..



- రైతులకు కలెక్టర్ దివాకర టిఎస్ సూచన
- ప్రాథమిక అంచనాల ప్రకారం 17 మండలాల్లో కరువు ప్రభావం
- పశుగ్రాసం కొరత నివారణకు 15 రోజుల్లో గడ్డి విత్తనాల పంపిణీ
- ఎస్ఐఆర్ 2026లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తాం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి గడువు
- మీడియా సమావేశంలో కలెక్టర్

**ఖమ్మం, అక్టోబర్ 16(మనం బ్యూరో) :** ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు యాసంగి సీజన్లో వరి సాగు చేయకుండా, చిరు ధాన్యాలు, పప్పుధాన్యాలు, తదితర ఆరుతడి పంటల సాగు చేయాలని కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీరు, పశువుల అవసరాలకు వినియోగించాల్సి ఉన్నందున యాసంగిలో ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల నుంచి సాగునీటి విడుదల ఉండదని స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి శ్రీనివాస రెడ్డిలతో కలిసి ఎల్నినో ప్రభావం, ఎస్ఐఆర్ 2026, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి ఎల్నినో ప్రభావం నేపథ్యంలో ముందస్తుగానే రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ పంటల

- మిగతా 2లో..

# పాఠశాలల మరమ్మతులకు నిధులివ్వండి..!

- నూతన భవనాలు, మరమ్మతులకు రూ.10.12 కోట్లు అవసరం
- ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయానికి త్వరగా రెగ్యులర్ వీసీని నియమించాలి
- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి



**ఖమ్మం, అక్టోబరు 16(మనం బ్యూరో) :** ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడం, విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్యలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాతో మంత్రి సమావేశమయ్యారు. ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో నూతన

- మిగతా 2లో..

# తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

**ఖమ్మం, అక్టోబర్ 16(మనం న్యూస్) :** తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం మహిళా విభాగం ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ, తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని చాటిచెప్పారు. టీజీఓ జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంలో ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉందని, పూలతో బతుకమ్మను పేర్చి ప్రకృతిని ఆరాధించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి పట్ల కృతజ్ఞతాభావం, కుటుంబ సంక్షేమం, సమాజ శ్రేయస్సు వంటి విలువలను ఈ పండుగ

- మిగతా 21లో..

టిజిఓ ఖమ్మం జిల్లా మహిళా ఉద్యోగుల భాగస్వామ్యంతో ఘనంగా బతుకమ్మ సంబరాలు

21లో..




# భూ రీ సర్వే నెల రోజుల్లో పూర్తిచేయాలి



- జీఓ నం. 76 కింద దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పక్కాగా చేపట్టాలి
- భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అంకిత్
- మామిడిగుండాలలో సర్వే పనులు పరిశీలించిన కలెక్టర్

**ఇల్లందు, అక్టోబర్ 16(మనం న్యూస్) :** జిల్లాలో భూ రీ సర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, కచ్చితత్వంతో విధులు నిర్వహించాలని సూచించారు. శుక్రవారం ఇల్లందు ప్రాంతంలో పర్యటించిన కలెక్టర్ ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలు, మామిడి

- మిగతా 2లో..

# యాసంగిలో వరి సాగు చేయవద్దు..

(మొదటిపేజీ తరువాయి)

సాగు వైపు ప్రోత్సహించామని తెలిపారు. జిల్లాలో 17 మండలాల్లో సాధారణం కంటే 20 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, కరువు ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు చెప్పారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 17 మండలాల్లో కరువు పరిస్థితులు ఉండవచ్చని గుర్తించామని, వీటిలో 10 మండలాల్లో తీవ్ర కరువు, ఏడు మండలాల్లో సాధారణ కరువు పరిస్థితులు ఉన్నట్లు వివరించారు. గత వర్షాకాలంలో భూగర్భ జలమట్టం సుమారు 2.5 మీటర్ల లోతులో ఉండగా, ప్రస్తుతం 3.56 మీటర్ల లోతుకు పడిపోయిందని తెలిపారు. కామేపల్లి, ఎర్రుపాలెం, సత్తుపల్లి, ఏన్కూరు మండలాల్లో భూగర్భ జలాలు 5 నుంచి 10 మీటర్ల లోతుకు పడిపోయాయని పేర్కొన్నారు. ఇటీవల తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల కొంత మేర భూగర్భ జలాలు పెరిగినప్పటికీ, రాబోయే 15 రోజుల్లో జల మట్టాలు మరింత తగ్గే అవకాశం ఉందని తెలిపారు. గత వానాకాలంతో పోలిస్తే అధికారుల అవగాహన కార్యక్రమాల ఫలితంగా జిల్లాలో వరి సాగు విస్తీర్ణం సుమారు 90 వేల ఎకరాలు తగ్గి, ఇతర పంటలు వేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. బోరుబావులపై ఆధారపడి వరి సాగు చేసిన రైతులు కూడా ప్రస్తుతం నీటి కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందన్నారు. రాబోయే వర్షాకాలం వరకు తగిన వర్షాలు కురిసే అవకాశాలు పరిమితంగా ఉన్నందున రైతులు యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. కరువు పరిస్థితుల్లో గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం కింద అవసరమైన పనులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. గత కరోనా కాలంలో కల్పించిన ఉపాధి కంటే ఎక్కువ పనులను ప్రస్తుతం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. రైతులు, కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వీబీ-జీ రామ్జీ పథకం క్రింద భూగర్భ జలాల పెంపునకు ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, సామూహిక నీటి సంరక్షణ నిర్మాణాలు, వర్షపు నీటి సంరక్షణ గుంతలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని సూచించారు. నీటి కాలువల్లో అడ్డంకులు, చెత్త, పిచ్చి మొక్కలను తొలగించడం వంటి పనులు చేపట్టాలని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను వినియోగించుకునే అవకాశం ఉన్నందున సత్తుపల్లి, వైరా ప్రాంతాల్లో సాధ్యమైనంత మేరకు చెరువులను నింపినట్లు కలెక్టర్ తెలిపారు. తుఫాను కారణంగా పాలేరు రిజర్వాయర్ లోకి వచ్చిన అదనపు నీటిని భక్త రామదాసు ఎత్తిపోతల పథకం సహా ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగించుకుని చెరువులను నింపినట్లు వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని ప్రజల త్రాగునీటి అవసరాలకు, పశువుల నీటి అవసరాలకు ప్రాధాన్యంగా వినియోగించాల్సి ఉంటుందని చెప్పారు. యాసంగి పంటలకు ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల నుంచి సాగునీటి విడుదల ఉండదని స్పష్టం చేశారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించి అధిక నీరు అవసరమయ్యే పంటల సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. వైరాలో అందుబాటులో ఉన్న నీరు సుమారు 149 రోజులు, పాలేరులో నీరు సుమారు 99 రోజుల పాటు తాగునీరు అందించవచ్చని తెలిపారు. వచ్చే ఆగస్టు వరకు తాగునీటి సరఫరా కొనసాగించేందుకు పాలేరు రిజర్వాయర్ను మరో రెండు నుంచి మూడు విడతల్లో నింపాల్సి ఉంటుందని చెప్పారు. నాగార్జునసాగర్ నుంచి తాగునీటి అవసరాల కోసం నీటి కేటాయింపులు కోరుతూ ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రజలు నీటిని, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని, నీటి వృథా, విద్యుత్ వృథాను అరికట్టాలని సూచించారు. ఖరీఫ్ పంటలను కాపాడేందుకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా ప్రయత్నిస్తుందని, పోలీస్, నీటిపారుదల, వ్యవసాయ శాఖల సమన్వయంతో అందుబాటులో ఉన్న నీటిని అవసరమైన ప్రాంతాలకు చేరేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని సుమారు ఐదు లక్షల పశువులకు అవసరమైన నీరు, పశుగ్రాసం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. వచ్చే ఆగస్టు వరకు అవసరమైన పశుగ్రాసం సుమారు 7.5 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, ప్రస్తుతం జిల్లాలో ఐదు లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందుబాటులో ఉందని చెప్పారు. 12 మండలాల్లో పశుగ్రాసం కొరత ఉండగా, ఏడు మండలాల్లో తీవ్ర కొరత ఉన్నట్లు తెలిపారు. పశుగ్రాసం కొరత మరో ఐదు నెలల తర్వాత తీవ్రంగా ఎదురయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. లోటు ఉన్న మండలాల్లో పాడి రైతులను గుర్తించి పశుగ్రాస విత్తనాలు అందిస్తామని, విత్తనాలు నాటిన రెండు నెలల్లో పశుగ్రాసం అందుబాటులోకి వచ్చేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రాబోయే 15 రోజుల్లో రైతులకు గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తామని వెల్లడించారు. నీటి కొరత పరిస్థితుల్లో అక్రమంగా నీటిని వినియోగించడాన్ని సహించబోమని కలెక్టర్ తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో లీకేజీలు, బహిరంగ కనెక్షన్ల ద్వారా నీటి వృథాను అరికడతామని చెప్పారు. ఖాళీ ప్లాట్లకు ఇచ్చిన మిషన్ భగీరథ కనెక్షన్లను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కనెక్షన్లపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే గత నెలలో విద్యుత్ డిమాండ్ సుమారు 60 శాతం, ఈ నెలలో సుమారు 80 శాతం పెరిగిందని తెలిపారు. వ్యవసాయ సంబంధిత ఫీడర్ల నుంచి విద్యుత్ డిమాండ్ అధికంగా వస్తోందని, అందుబాటులో ఉన్న వనరులతో సాధ్యమైనంత మేరకు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఎస్ఐఆర్ 2026పై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు సంబంధించి మొత్తం 1,74,519 నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వీటిలో 1,322 నోటీసుల పంపిణీ పెండింగ్లో ఉందని, ఆన్లైన్లో వివరాలు సమర్పించినప్పటికీ నోటీసులు అందని వారికి కూడా నోటీసులు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు సుమారు 1.60 లక్షల మంది ఓటర్లకు నిబంధనల ప్రకారం విచారణ ప్రక్రియ నిర్వహించామని, వారిలో 1,44,206 మందిని తుది ఓటరు జాబితాలో చేర్చేందుకు అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. మిగిలిన విచారణ ప్రక్రియ కొనసాగుతోందని, నవంబర్ నాటికి ప్రక్రియను పూర్తి చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ తుది ఓటరు జాబితాలో చోటు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఇప్పటివరకు 30,727 మంది పట్టభద్రులు ఓటరు నమోదుకు దరఖాస్తులు సమర్పించారని కలెక్టర్ తెలిపారు. గత 2024 ఎన్నికల్లో మొత్తం 83,879 మంది ఓటర్లు నమోదయ్యారని, ఈసారి కనీసం రెండు లక్షల మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు తప్పని సరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ రైతులకు వీలైనంత సహకారం అందించడమే ప్రభుత్వ ఉద్దేశ్యమని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల నుంచి విడుదల చేసే నీరు అవసరమైన రైతులకు చేరేలా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. యాసంగి పంటలకు సాగునీటి విడుదల ఉండదని, అధిక నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయవద్దని రైతులకు సూచించారు. నీటి పంపిణీ సమయంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీస్ శాఖ తరఫున జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తామని, అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన వివిధ ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల మరమ్మతులకు నిధులివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

పాఠశాలల్లో నూతన భవనాల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.10.12 కోట్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయానికి రెగ్యులర్ ఉపకులపతిని (వీసీ) త్వరితగతిన నియమించడంతో పాటు, విశ్వవిద్యాలయంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**బడులకు భరోసా.. విద్యార్థులకు మెరుగైన వసతులు...**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతను అధిగమించి, విద్యార్థులకు మెరుగైన అభ్యాస వాతావరణం కల్పించాల్సిన అవసరాన్ని మంత్రి వివరించారు. ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో అభివృద్ధి పనుల కోసం రూ.10.12 కోట్లు కేటాయించాలని కోరారు. నూతన భవనాల నిర్మాణం, మరమ్మతులు, అవసరమైన విద్యా సదుపాయాల కల్పనతో పాటు డిజిటల్, ఇతర బోధనా పరికరాలను సమకూర్చడం ద్వారా ప్రభుత్వ బడులను మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. ఈ పాఠశాలల్లో అధికశాతం బలహీనవర్గాలు, వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తే విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెరుగుతుందని, ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా సర్కారీ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. అందుబాటులో ఉన్న నిధుల వనరుల ద్వారా ప్రతిపాదిత మొత్తాన్ని మంజూరు చేసి, పనులను ప్రాధాన్యంగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

**16 పాఠశాలలు.. 2,988 మంది విద్యార్థులకు ప్రయోజనం...**

ఖమ్మం అర్బన్ పరిధిలోని ఎనిమిది, రఘునాథపాలెం మండలంలోని మరో ఎనిమిది పాఠశాలలు కలిపి మొత్తం 16 బడులను అభివృద్ధి ప్రతిపాదనల్లో చేర్చారు. వీటిలో 2,988 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల మెరుగుదల, విద్యా పరికరాల ఏర్పాటు తదితర పనులకు అంచనాలు రూపొందించారు.

**ఖమ్మం అర్బన్ పరిధిలో.. :**

ఎస్ఎస్సీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాండురంగాపురం జడ్పీ ఉన్నత పాఠశాల, రాజేంద్రనగర్ ఉన్నత పాఠశాల, జి.ఖమ్మం ఉన్నత పాఠశాల, బాలాజీనగర్ జడ్పీ ఉన్నత పాఠశాల, కుచవల్లి ప్రాథమిక పాఠశాల, బాలాపేట (వైఎస్సార్ కాలనీ) ఎంపీపీఎస్, రాజకవీధి ప్రాథమిక పాఠశాల ఉన్నాయి.

**రఘునాథపాలెం మండలంలో..:**

వి.వెంకటాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, ఏర్లపూడి, వి.వెంకటాయపాలెం ఎంపీపీఎస్, పువ్వాడనగర్ ఎంపీపీఎస్, పాపటపల్లి, మంచుకొండ, కోయచలక, చిమ్మపూడి పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రతిపాదనలకు నిధులు మంజూరైతే ఆయా పాఠశాలల్లో వసతుల మెరుగుదలకు మార్గం సుగమం కానుంది. విద్యార్థులకు మెరుగైన తరగతి గదులు, అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ విద్యాసంస్థలపై నమ్మకం మరింత పెరిగే అవకాశం ఉంది.

**వర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించాలి...**

కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయ అభివృద్ధి, సజావైన నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. విశ్వవిద్యాలయానికి రెగ్యులర్ ఉపకులపతిని త్వరగా నియమించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాకు విజ్ఞప్తి చేశారు. విశ్వవిద్యాలయ పరిపాలన మరింత సమర్థవంతంగా సాగడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు పూర్తిస్థాయి నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. ఎర్త్ సైన్సెస్ రంగంలో విద్య, పరిశోధనలకు ప్రాధాన్యం కల్పించడంతో పాటు, విశ్వవిద్యాలయాన్ని ఉన్నత ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

# భూ రీ సర్వే నెల రోజుల్లో పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

గుండాలలో భూ రీ సర్వే పనులు, జీఓ నం. 76 కింద సింగరేణి భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులకు సంబంధించి చేపట్టిన క్షేత్రస్థాయి సర్వేను పరిశీలించారు. సర్వే పురోగతి, భూముల విస్తీర్ణం, గతంలో జారీ చేసిన పట్టాలు, భూ రికార్డులు, సరిహద్దుల నిర్ధారణకు సంబంధించిన వివరాలను సర్వే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ పరిధిలోని భూములకు సంబంధించి పాత రికార్డులు, మ్యాప్లను పరిశీలించి, గతంలో పట్టాలు జారీ చేసిన భూముల సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. అటవీ, రెవెన్యూ భూముల హద్దుల విషయంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని ఆదేశించారు. బోటి గుంపులో మొత్తం 4,733 ఎకరాల భూమి ఉన్నట్లు, గ్రామ పరిధిలోని 130వ సర్వే నంబరులో సుమారు 4,200 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లు సర్వే సిబ్బంది కలెక్టర్కు వివరించారు. భూ సరిహద్దుల నిర్ధారణలో గందరగోళానికి తావులేకుండా రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహించి, నెల రోజుల్లోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా ఎంపీడీవో, ఏపీఎం అందుబాటులో లేకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ పర్యటనకు సంబంధించిన విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేస్తూ, సంబంధిత అధికారులకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. సర్వే నిర్వహణ తీరును, స్థలాల వాస్తవ పరిస్థితులను, దరఖాస్తుదారుల వివరాల నమోదు ప్రక్రియను సమీక్షించారు. దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత రికార్డులతో సరిపోల్చుకోవాలని అధికారులకు సూచించారు. స్థలాల విస్తీర్ణం, సరిహద్దులు, వినియోగం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవ వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా ప్రతి దరఖాస్తును పారదర్శకంగా పరిశీలించాలని, సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను సంబంధిత రికార్డులతో ధ్రువీకరించి, తదుపరి ప్రక్రియను నిబంధనల మేరకు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

**పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ :** ఇల్లందులోని సింగరేణి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. నూతన ఓటరు నమోదు కోసం ఫారం-6 ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, నమోదు ప్రక్రియ పురోగతిని బూత్ స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని, ప్రత్యేక శిబిరాల సమయంలో బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సంప్రదింపు నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉంచాలని, నమోదు ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కాశీరాం, జిపిఓ లక్ష్మీకాంత్, మామిడి గుండాల సర్పంచ్ ఎట్టి రమణ మరియు వివిధ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మనం



ఖమ్మం

ఖమ్మం కార్పొరేషన్- ఖమ్మం అర్బన్ - రఘునాథపాలెం

# లాటరీ విధానంలో కల్లూరు 2బి బార్ కేటాయింపు

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- మొత్తం 325 దరఖాస్తులు
- వీడియో రికార్డింగ్ మధ్య పారదర్శకంగా డ్రా ఆఫ్ లాట్స్ నిర్వహణ
- లాటరీలో చుంచుపల్లికి చెందిన చావా తరుణ్‌కు బార్ కేటాయింపు



**ఖమ్మం, అక్టోబర్– 16(మనం న్యూస్) :** ఖమ్మం జిల్లా కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ఒక 2బి బార్ కేటాయింపు ప్రక్రియను లాటరీ విధానంలో పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సమక్షంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బార్ కేటాయింపు కోసం డ్రా ఆఫ్ లాట్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ఒక 2బి బార్ కేటాయింపు కోసం మొత్తం 325 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. లాటరీ ప్రక్రియలో భాగంగా ప్రతి దరఖాస్తుదారుకు కేటాయించిన టోకెన్ నంబర్‌ను నాణెంపై ప్రదర్శించి, ఆ నాణేలను ఒక స్టీల్ బాక్స్ లో ఉంచారు. అనంతరం బాక్స్ లో నుంచి ఒక నాణేన్ని తీసి విజేతను ఎంపిక చేశారు. లాటరీ ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహించామని ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రతి దశను వీడియో రికార్డింగ్ చేసినట్లు తెలిపారు. దరఖాస్తుదారులకు సమాన అవకాశాలు కల్పించే విధంగా నిబంధనల ప్రకారం డ్రా నిర్వహించామని, ఈ లాటరీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లికి చెందిన చావా తరుణ్ (తండ్రి: శ్రీనివాస్ రావు)కు డ్రా వచ్చిందని ఈ విధంగా లాటరీ ద్వారా బార్ కేటాయింపు ప్రక్రియను నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. జానయ్య, ఎక్సైజ్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలి



**ఖమ్మం, అక్టోబర్ 16(మనం న్యూస్) :** ప్రతి వార్డు ఆఫీసర్ రోజుకు ఐదు నుంచి పది మంది పన్ను చెల్లింపుదారుల నుంచి పన్నులు వసూలు చేయాలనీ రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు వార్డు ఆఫీసర్లతో పన్నుల వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు పన్నుల వసూళ్లలో ఆశించిన స్థాయిలో పురోగతి సాధించని వార్డుల్లో వసూళ్లను మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులు సూచించారు. ప్రతి వార్డు ఆఫీసర్ రోజుకు కనీసం ఐదు నుంచి పది మంది పన్ను చెల్లింపుదారుల నుంచి పన్నులు వసూలు చేసేలా పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. పన్ను బకాయిలు ఉన్న వారిని గుర్తించి, వారిని సంప్రదించి పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్డుల వారీగా పన్నుల వసూళ్ల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

రూపొందించిన కార్యాచరణ ప్రకారం పన్నుల వసూళ్లను ఈ పండుగ నుంచే ప్రారంభించి, వసూళ్లలో గణనీయమైన పురోగతి సాధించేలా చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులు వార్డు ఆఫీసర్లకు ఆదేశాలు జారీ చేశారు. మీటింగ్లో ఆర్వో సుధాకర్ ఆర్ వో వెంకటలక్ష్మి రెవెన్యూ ఇన్స్పెక్టర్ వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# జాతీయ ఆయుష్ మిషన్ క్రింద 7 పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ఖమ్మం జిల్లాలో ఆయుష్ విభాగంలో వివిధ పోస్టుల భర్తీ
- అక్టోబర్ 19 నుంచి 26 వరకు దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తులను ఐడీఓసీ ఇన్‌వార్డ్ సెక్షన్‌లో అందజేయాలి

**ఖమ్మం, అక్టోబర్ 16(మనం న్యూస్) :** ఖమ్మం జిల్లాలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ ఆధ్వర్యంలో జాతీయ ఆయుష్ మిషన్ క్రింద పబ్లిక్ హెల్త్ ప్రోగ్రామ్స్ నిర్వహణకు వివిధ పోస్టుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 7 పోస్టులను భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో పీజీ అర్హత కలిగిన ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టు ఒకటి, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు మూడు, డైటీషియన్ పోస్టు ఒకటి, సైకోసోషల్ కౌన్సెలర్ పోస్టు ఒకటి, యోగా ప్రొఫెషనల్ పోస్టు ఒకటి ఉన్నాయని తెలిపారు. పోస్టులను బట్టి నెలకు రూ.60,000 చొప్పున పీజీ అర్హత కలిగిన ఆయుష్ మెడికల్ ఆఫీసర్‌కు, రూ.40,000 చొప్పున ఆయుష్ మెడికల్ ఆఫీసర్‌కు, రూ.20,000 చొప్పున డైటీషియన్‌కు, రూ.28,000 చొప్పున యోగా ప్రొఫెషనల్‌కు వేతనం చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సైకోసోషల్ కౌన్సెలర్‌కు ఒక్కో సెషన్‌కు రూ.500 చొప్పున చెల్లిస్తారని, సంవత్సరానికి కనీసం 200 విజిట్లు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పీజీ అర్హత కలిగిన ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఆయుర్వేద, యునాని, హోమియోపతి లేదా నాచురోపతిలో పీజీ డిగ్రీ కలిగి ఉండాలనీ తెలిపారు. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టుకు సంబంధిత ఆయుష్ వైద్య విధానంలో డిగ్రీతో పాటు నాలుగున్నర సంవత్సరాల కోర్సు, ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలని, డైటీషియన్ పోస్టుకు బి.ఎస్సీ న్యూట్రిషన్ డిగ్రీ, సైకోసోషల్ కౌన్సెలర్ పోస్టుకు మాస్టర్ ఇన్ సోషల్ వర్క్ పీజీ డిగ్రీ ఉండాలని తెలిపారు. యోగా ప్రొఫెషనల్ పోస్టుకు నాచురోపతిలో డిగ్రీ లేదా నాచురోపతి అండ్ యోగిక్ సైన్సెస్‌లో డిప్లొమా కలిగి ఉండాలని పేర్కొన్నారు. 01.07.2026 నాటికి అభ్యర్థుల కనీస వయస్సు 18 సంవత్సరాలు, గరిష్ఠ వయస్సు 44 సంవత్సరాలు ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదు సంవత్సరాలు, దివ్యాంగ అభ్యర్థులకు పది సంవత్సరాల వయో పరిమితి సడలింపు ఉంటుందని పేర్కొన్నారు. అర్హత పరీక్షలో సాధించిన మార్కులకు 90 శాతం వెయిటేజీ, వయస్సు ఆధారంగా మరో 10 మార్కులు కేటాయించి మెరిట్ జాబితా రూపొందిస్తారని తెలిపారు. రోస్టర్ పాయింట్లకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ , పీజీ అర్హత కలిగిన ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఓపెన్ కేటగిరీ రోస్టర్ పాయింట్ కేటాయించినట్లు తెలిపారు. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ మూడు పోస్టులకు వరుసగా ఓపెన్ కేటగిరీ, ఎస్సీ గ్రూప్–××, ఓపెన్ కేటగిరీ రోస్టర్ పాయింట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. డైటీషియన్, సైకోసోషల్ కౌన్సెలర్, యోగా ప్రొఫెషనల్ పోస్టులకు ఒక్కొక్కటి చొప్పున ఓపెన్ కేటగిరీ రోస్టర్ పాయింట్ కేటాయించినట్లు తెలిపారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఆయా పోస్టులకు కేటాయించిన రోస్టర్ పాయింట్లకు అర్హత కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన అభ్యర్థుల నుంచి అక్టోబర్ 19 నుంచి అక్టోబర్ 26 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఖమ్మం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఇన్‌వర్డ్ సెక్షన్‌లో అందజేయాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు, ఇతర వివరాలు శనివారం జిల్లా అధికారిక వెబ్‌సైట్ khammam.telangana.gov.in లో అందుబాటులో ఉంచనున్నట్లు మరిన్ని వివరాల కోసం ఆయుష్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ పద్మావతి సెల్ నంబర్ 9247829717ను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఉద్యోగుల వెల్నెస్ సెంటర్ ఖాళీల భర్తీకి మెరిట్ లిస్ట్ ప్రదర్శన...

## ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్

**ఖమ్మం, అక్టోబర్ 16(మనం న్యూస్) :** ఖమ్మంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లోని గల ఈ జె హెచ్ ఎస్ వెల్నెస్ సెంటర్‌లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్న మెడికల్ ఆఫీ సర్, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్, ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ లిస్టును విడుదల చేయడం జరిగిందని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెరిట్ జాబితాలో అభ్యర్థుల మార్కులు, అనుభవం, ఇతర వివరాలను వెల్లడించినట్లు అన్నారు. ప్రచురించిన వివరాలపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే, సంబంధిత అభ్య ర్థులు తగిన ఆధారాలతో ఈ నెల 17 (శనివారం) నుండి ఈ నెల 19 (సోమవారం) వంˇకు ఖమ్మంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మెడికల్ సూపరింటెండెంట్ కార్యాల యంలో సమర్పించవలసిందిగా తెలిపారు. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ www.gghkhammam.com ను సందర్శించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# దుర్గా మాతకు ప్రత్యేక పూజలు

## భవానీ స్వాములకు అన్న ప్రసాదల వితరణ



**ఖమ్మం, అక్టోబర్ 16(మనం న్యూస్) :** దేవి నవరాత్రుల సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కొండపల్లి ముత్తయ్య, లక్ష్మి తమ కుమారుడు కొండపల్లి కొరివి వీరన్న,లు తమ నివాసంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మ అమ్మవారికి ముత్తయ్య కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి లోకసమస్త సుఖినోభవంతు అని ప్రార్థించారు. అనంతరం నివాస ప్రాంగణంలో భవానీ స్వాముల ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.భజన కీర్తనలతో ఆ ప్రాంతం అంతా ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది.కార్యక్రమంలో భాగంగా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి, దీక్షలు తీసుకున్న వందలాది మంది భవానీ స్వాములకు ఘనంగా అన్నప్రసాద వితరణ చేపట్టారు. ముత్తయ్య కుటుంబ సభ్యులు స్వయంగా భవానీలకు అన్న ప్రసాదాలు అందించి తమ ఆతిథ్యాన్ని చాటుకున్నారు. ఈకార్యక్రమంలో గురుస్వామి పస్తం శ్రీనివాస్ కొండపల్లి రమణయ్య, సింగపూరి శ్రీను, కొండపల్లి నాగయ్య, కొండపల్లి రామకృష్ణ, కొండపల్లి సుబ్బమ్మ, కొండపల్లి మంజుల, సిరవాటి పద్మ, పస్తం బాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# లకారం జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

## 5 బుల్లెట్ వాహనాలు స్వాధీనం

## నంబర్ ప్లేట్లు లేని 25 వాహనాలకు జరిమానాలు

**ఖమ్మం, అక్టోబర్ 16 (మనం న్యూస్) :** ఖమ్మం నగరంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను అరికట్టే లక్ష్యంతో ట్రాఫిక్ సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐలు రవి, రాము సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం లకారం జంక్షన్ వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం, వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడటం, నిబంధనలకు విరుద్ధంగా బుల్లెట్ మోటార్ సైకిళ్లకు శబ్దం ఎక్కువగా వచ్చే సైలెన్సర్లు వినియోగించడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఐదు బుల్లెట్ మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా నంబర్ ప్లేట్లు లేని 25 వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం నిర్వహించే ప్రత్యేక తనిఖీలకు వాహనదారులు సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు .

మనం



# పాలేరు

కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం

## కరెంటు కోతలను ఎత్తివేయాలి

### మాస్ లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య డిమాండ్

**కూసుమంచి, అక్టోబర్ 16 (మనం న్యూస్)** : వేళాపాలలేని కరెంటు కోతల వలన రైతాంగం పంటల ఎండి పోతున్నాయని, గృహ అవసరాలు తీర్చుకోవటానికి ఇబ్బందిగా ఉందని, ఫ్యాక్టరీలు హోటల్స్ నడవట్లేదు, కనుక 24 గంటల కరెంటు సౌకర్యం అందించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పాలేరు డివిజన్ కమిటీ కార్యదర్శి బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కూసుమంచిలో పార్టీ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బందెల వెంకయ్య హాజరై మాట్లాడుతూ, ఈ సంవత్సరం ఎల్ ని నో ప్రాబ్లం వలన వర్షాలు కొరకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతుంటే, మరోపక్క కరెంటు కోతలు విధించటం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను అధికంగా పెంచి, సామాన్య, మధ్యతరగతి ప్రజల మీద భారాలు మోపినారని ఇది దుర్మార్గమైన చర్యకు నిదర్శనమని బందెల వెంకయ్య విమర్శించారు. గోరుచుట్టుపై రోకటి పోటులా ఇప్పటికే ప్రజలు పెట్రోల్, డీజిల్, పెరిగిన



ఔషధాల రేట్లు, వైద్య ఖర్చులు, కరెంటు చార్జీలు, ధరించే దుస్తుల రేట్లు వంటి పెరిగిన భారాలతో ప్రజలు ఇబ్బందులు పడుతూ ఉంటే మోడీ ప్రభుత్వం సామాన్య, మధ్యతరగతి ప్రజలపై నిత్యావసర సరుకుల ధరలను పెంచి సామాన్య మానవులు బ్రతకలేని పరిస్థితికి దిగజార్చారని ఆయన విమర్శించారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలను నెరవేర్చడం కోసం పని చేస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి, వాటిని నెరవేర్చకుండా, తిరిగి ప్రజల మీద భారాలు వేయటం అవకాశవాదం,ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని ఆయన విమర్శించారు. ప్రధాని మోడీ ప్రభుత్వం అంబానీ, అదాని లాంటి కార్పొరేటు బహుళ జాతి కంపెనీల ప్రయోజనాలు కాపాడటం కోసం పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. పెంచిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించుకుంటే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఆయన మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ సర్ ప్రక్రియ పేరుతో 13 కోట్ల కోట్లను తొలగించడం అప్రజాస్వామిక చర్య యని, తప్పుడు చర్యకు పాల్పడిన జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలో ప్రజాస్వామిక ఉద్యమాలకు కేంద్రమైన జంతర్మంతర్ను మూసివేయటం ప్రజాస్వామ్య విరుద్ధ మైనదని, కనుక జంతర్ మంతర్ ను తెరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు ఆర్ శివలింగం మండల నాయకులు పోటు నాగేశ్వరరావు, కొమ్మురోసయ్య, పోటు జోగారావు, రామ్మూర్తి, తాళ్లపల్లి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## కూసుమంచి సబ్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీఎండి వరుణ్ రెడ్డి



**కూసుమంచి, అక్టోబర్ 16 (మనం న్యూస్)** : టీజీ ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి శుక్రవారం 132 కె.వి కూసుమంచి సబ్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులకు అంతరాయం లేని విద్యుత్తును ఇవ్వాలని తగు సూచనలు చేశారు. 33/11కేవి కూసుమంచి సబ్ స్టేషన్లో 5.ఎమ్ వి ఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ నుండి 8 ఎం వి ఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ కన్వర్షన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం సూపర్డెంట్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ట్రాన్స్కో ఎస్సీ రాంబాబు, ఖమ్మం రూరల్ డి ఈ సిహెచ్ నాగేశ్వరావు . కూసుమంచి ఏడిఈ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

## సహృదయత చాటుకున్న సర్పంచ్ దంపతులు

### ప్రతి ఏటా ఆనవాయితీగా పంచాయతీ సిబ్బందికి నూతన దుస్తులు పంపిణీ



**ముదిగొండ అక్టోబర్ 16 (మనం న్యూస్)** : న్యూ లక్ష్మీపురం గ్రామ పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ దంపతులు సలీమా--ఖాశిం బాబు దసరా పండుగ కానుకగా నూతన దుస్తులను అందజేశారు. ప్రతి ఏటా దసరా పండుగ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి నూతన దుస్తులు పంపిణీ చేయడాన్ని ఆనవాయితీగా కొనసాగిస్తూ తమ సహృదయతను చాటుకుంటున్నారు. పండుగ వేళ సిబ్బందిని తమ కుటుంబ సభ్యులుగా భావిస్తూ వారికి కానుకలు అందజేయడం విశేషంగా నిలుస్తోంది.గ్రామ పంచాయతీ నిర్వహణలో సిబ్బంది పాత్ర కీలకమని, గ్రామంలో పారిశుద్ధ్యం, ఇతర ప్రజా సేవల నిర్వహణలో వారు నిరంతరం కృషి చేస్తుంటారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సిబ్బంది సేవలను గుర్తిస్తూ పండుగ సమయంలో వారికి నూతన దుస్తులు అందజేయడం ద్వారా వారిలో ఆనందాన్ని నింపారు. ప్రతి సంవత్సరం ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ సిబ్బందితో ఆత్మీయ అనుబంధాన్ని చాటుకుంటున్నారు.దసరా పండుగను పురస్కరించుకుని నూతన దుస్తులు అందుకోవడంతో పంచాయతీ సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. సర్పంచ్ దంపతులు తమ పట్ల చూపిస్తున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి దేగల సురేష్తో పాటు పంచాయతీ సిబ్బంది రవి, రవీంద్రబాబు, లింగయ్య, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్



**కూసుమంచి, అక్టోబర్ 16 (మనం న్యూస్)** : బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ కు సంబంధించి సుమారు 50 అప్లికేషన్లను డిప్యూటీ తహసీల్దార్ ఖాజా మొయినుద్దీన్ ఖాన్ కి సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ గడ్డం వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు మహేందర్ నాయక్, ఎమ్మెల్సీ మండల కో-కన్వీనర్లు వడ్డంపూడి నరేష్, బానోత్ మోతీలాల్, యువ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నబోయిన ఉదయ్ కిరణ్, గిరిజన మోర్చా నాయకులు జర్పుల కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారుల సేవలు ప్రశంసనీయం

### టీడబ్ల్యూఎంఎఫ్ జిల్లా ఇంచార్జీ గుండా ఉపేందర్ రెడ్డి





**కూసుమంచి, అక్టోబర్ 16 (మనం న్యూస్)** : కూసుమంచి పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన నాగరాజు విధుల్లో భాగంగా బదిలీపై వెళ్తున్న సందర్భంగా కృతజ్ఞతలు తెలియచేస్తూ శాలువాతో సన్మానం చేయడం జరిగినది. రెండు సంవత్సరాలు పైగా కూసుమంచిలో ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ, శాంతి భద్రతా పరిరక్షణలో ఎక్కడ రాజీపడకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఓర్పుతో విధులు నిర్వంచడం అభినందియం అని, మళ్ళీ వారు ఉన్నత అధికారిగా ప్రమోషన్ పొంది కూసుమంచి సర్కిల్ పరిధిలో తిరిగి విధులు నిర్వహిస్తారు అని ఆశించడం జరిగింది. నూతన ఎస్ ఐ గా బాధ్యతలు చేపట్టిన సతీష్కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాంతి భద్రతా పరిరక్షణ కోసం నిరంతరం బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు మండల పరిధిలో రాకుండా ఉక్కుపాదం మోపి, ప్రజల మన్ననలు పొందాలి అని కోరడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సతీష్ని శాలువాతో సత్కరించడం జరిగినది. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు దాసరి వెంకటేశ్వర్లు, మంద చంద్ర శేఖర్ గౌడ్, సీనియర్ పాత్రికేయులు సవాల్వాది వేణు, ఫోటోగ్రాఫర్ శ్రీను పాల్గొన్నారు.

## ఘనంగా చావా శివరామకృష్ణ జన్మదిన వేడుకలు

### తాటికొండ కిరణ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్..

### ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

**తిరుమలాయపాలెం అక్టోబర్ 16 (మనం న్యూస్)** : పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ జన్మదిన వేడుకలు శుక్రవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ నాయకులు తాటికొండ కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఆత్మీయుడైన చావా శివరామకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు స్వీట్లు పంపిణీ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తిరుమలాయపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో నిర్వహించి రోగులకు ఆప్యాయతను పంచారు. కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ బోడ మంగీలాల్, కోక్కిరేణి సర్పంచ్ కర్నాటి రాజేంద్రప్రసాద్ బత్తుల రవికుమార్ ముద్దుల మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్ గౌడ్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం రాజశేఖర్ మండల కాంగ్రెస్ నాయకులు పోట్ల కిరణ్ జాల కిరణ్ జడల రమేష్ గౌడ్ పత్తి నాగేశ్వరరావు చుంచు కోటయ్య షేక్ మదర్ డీలర్ పిడియాల నవీన్ చామకూరి శ్రీనివాస్ చావగాని ఉపేందర్ గుడిపూడి వీరభద్రం మొక్కపాటి నాగేశ్వరరావు పుసులూరి సురేష్ కార్యకర్తలు, చావా శివరామకృష్ణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## కూసుమంచి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సతీష్



**కూసుమంచి, అక్టోబర్ 16 ( మనం న్యూస్ )** : ఖమ్మం జిల్లా, కూసు మంచి పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా సతీష్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ నాగరాజు బదిలీపై కల్లూరు కు వెళ్లారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఎస్ఐ నాగరాజును మరియు బాధ్యతలు స్వీకరించిన సతీష్ ను సీఐ సంజీవ్ అభినందించారు, ఈ సందర్భంగా ఇరువురు సిఐ సంజీవ్ ని మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేసినారు, అదేవిధంగా శాలువాలతో సన్మానం చేసినారు, అదేవిధంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందించారు, మండలంలో గల పాత్రికేయులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు అందరూ పోలీస్ స్టేషన్కు వచ్చి కృతజ్ఞతలు తెలియజేస్తూ బొకేలు అందజేస్తూ శాలువాలతో సన్మానం చేసినారు, ఈ సందర్భంగా ఇద్దరు ఎస్ఐలు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

# గ్రామీణ, పట్టణ ప్రాంతంలో ఉపాధి హామీ పనులు కల్పించాలి



- తిరుమలాయపాలెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి
- వ్యవసాయ కూలీలకు జీవన భృతి 12000 వెంటనే ఇవ్వాలి

**తిరుమలాయపాలెం, అక్టోబర్ 16 (మనం న్యూస్) :** కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో ఉపాధి హామీ పనులు చేపట్టి కరువు నివారణ చర్యలు తీసుకోవాలని. ఎల్ నీ నో కారణంగా వర్ష భావ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గ్రామీణ పట్టణ ప్రాంతాలలో కార్మికులకు పనులు దొరకక తీవ్ర ఇబ్బందుల గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే ఉపాధి హామీ పనులు చేపట్టాలి. తిరుమలాయపాలెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని. కరువు నివారణ చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంతంలో ప్రతి కార్మికుడికి ఉపాధి కల్పించాలని ఈరోజు గురువారం తిరుమలాయపాలెం మండల అభివృద్ధి అధికారి ఎం పి ఓ ప్రభాకర్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చిన అనంతరం అఖిలభారత ప్రగశీల వ్యవసాయ కార్మిక సంఘం ఏఐపీకే ఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బందెల వెంకయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అదనంగా రెండు లక్షల కోట్ల రూపాయల కేటాయించాలి. సంవత్సరానికి ?200 రోజు పని కల్పిస్తూ రోజు కూలి 800 రూపాయలు ఇవ్వాలి తదితర డిమాండ్స్ పై. దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేయడం జరుగుతుందని అన్నారు. ఎల్ నినో వర్షాభావ పరిస్థితులు కారణంగా కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనులకు చేపట్టాలి. గ్రామీణ ప్రాంతంలో పని అడిగిన వారందరికీ ప్రభుత్వం పని కల్పించాలి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలి రోజుకి 700 కూలి ఇవ్వాలి రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం మేరకు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనిని 150 రోజులు కల్పించాలి రోజు కూలి 600 ఇవ్వాలి. ఇందిరమ్మ భరోసా సంవత్సరానికి 12000 రూ అమలు చేయాలని. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ సహాయక చర్యలు తీసుకోవాలని వెంకయ్య అన్నారు. తిరుమలాయపాలెం మండల అభివృద్ధి అధికారి ఎంపిఓ ప్రభాకర్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చిన వారిలో అఖిలభారత ప్రగశీల వ్యవసాయ కార్మిక సంఘం , ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర నాయకులు రేపాకుల శివలింగం, ఖమ్మం జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఉన్నం నరేష్, తోకల సీతారాములు, తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ ట్యాబ్ పరీక్షలో కొమ్ము ఆరాధ్య అద్భుత విజయం

- 300కు 300 మార్కులు సాధించి జాతీయస్థాయిలో ప్రథమ స్థానం..
- తిరుమలాయపాలెం గ్రామానికి గర్వకారణం

**తిరుమలాయపాలెం, అక్టోబర్ 16 (మనం న్యూస్) :** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన కొమ్ము ఆరాధ్య ఐఐటీ ట్యాబ్ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచి గ్రామానికి, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచారు. అక్టోబర్ 15వ తేదీన కేరళ రాష్ట్రంలోని హైస్కూల్‌లో నిర్వహించిన ఈ పరీక్షలో దేశవ్యాప్తంగా సుమారు 500 పరీక్షా కేంద్రాల నుంచి విద్యార్థులు పాల్గొనగా, ఆరాధ్య 300 మార్కులకు గాను 300 మార్కులు సాధించి జాతీయస్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు సమాచారం. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభను కనబరిచి పూర్తి మార్కులు సాధించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆరాధ్య సాధించిన ఈ ఘనత ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడ్డారు. తిరుమలాయపాలెం



ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్ అభినందనలు ఆరాధ్య సాధించిన విజయాన్ని తెలుసుకున్న ఎంపీడీవో ఆర్. సిలార్ సాహెబ్ ఆమెను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే తిరుమలాయపాలెం గ్రామ ప్రజలు, పంచాయతీ కార్యదర్శి టి. రమేష్, సీపీఎం మండల కమిటీ నాయకులు ఆరాధ్యను అభినందించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుంటే అద్భుత విజయాలు సాధించవచ్చని ఆరాధ్య నిరూపించారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆరాధ్య భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# తెలంగాణ అడబిడ్డల అత్మీయబంధం పండుగ బతుకమ్మ

- విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి
- విద్యుత్ శాఖా కార్యాలయంలో ఘనంగా వేపకాయల బతుకమ్మ వేడుకలు



**ఖమ్మం, అక్టోబర్ 16(మనం న్యూస్) :** తెలంగాణ ఆడబిడ్డల జీవనంతో ముడిపడిన ఆత్మీయ బంధం, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసా చారి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఖమ్మం నగరంలోని మామిళ్ల గూడెం విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ వేడుకలను మహిళా అధికారులు, ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎస్ఈ శ్రీనివాసా చారి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా అధికారులు, ఉద్యోగులు రంగురంగుల వివిధ రకాల పుష్పాలతో బతుకమ్మలను అందంగా పేర్చి, గౌరమ్మకు పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కొబ్బరి కాయ, ప్రసాదాలు సమర్పించి, గౌరమ్మ ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి మహిళా ఉద్యోగులు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆటపాటలతో సందడి చేశారు. పూల సోయగాలు, బతుకమ్మ పాటలు, మహిళల కోలాటాలతో విద్యుత్ శాఖ కార్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. బతుకమ్మ సంబరాల్లో ఎస్ఏఓ జి. శ్రీధర్, డిఇ టెక్నికల్ కిరణ్ కుమార్, డిఈ ఎంఆర్ టీ అండ్ కన్స్ట్రక్షన్ కిరణ్ చక్రవర్తి, డిఈ డీపీఈ వెంకటేశ్వర్లు, ఏవో రెవెన్యూ శ్రీధర్, వివిధ కార్మిక సంఘాల ముఖ్య నాయకులు, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర అధికారులు, ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

మనం



# పాలేరు

కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం

## ఎస్సై సురేష్‌ను కలిసిన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం రాజశేఖర్



**తిరుమలాయపాలెం, అక్టోబర్ 16 (మనం న్యూస్) :** తిరుమలాయపాలెం మండల నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పోగుల సురేష్‌ను ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఉన్నం రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలేరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జి. మోహన్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సురేష్ ను ఘనంగా సత్కరించి, శాలువా కప్పి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉన్నం రాజశేఖర్, జి. మోహన్ మాట్లాడుతూ.. నూతన ఎస్సై పోగుల సురేష్ నాయకత్వంలో తిరుమలాయపాలెం మండలంలో శాంతిభద్రతలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, నిరుపేదలు, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేలా పోలీస్ శాఖ పనిచేయాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

**శాంతిభద్రతల పరిరక్షణకు కాంగ్రెస్ శ్రేణుల సహకారం**

మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో పోలీస్ యంత్రాంగానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణుల తరఫున ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తామని ఉన్నం రాజశేఖర్ స్పష్టం చేశారు. ప్రజలకు రక్షణ కల్పిస్తూ, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు కృషి చేసే పోలీస్ అధికారులను గౌరవించడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నం రాజశేఖర్, పాలేరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జి. మోహన్, తిరుమలాయపాలెం మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బత్తుల రమేష్, నాగుల్ మీరా, దమ్మాయిగూడెం గ్రామ కాంగ్రెస్ నాయకుడు వీరదాసు భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల వైపు రైతులు మళ్లాలి

### ఎల్‌నినో ప్రభావంపై రైతులకు ఏ.వో అవగాహన

**ముదిగొండ, అక్టోబర్ 16(మనం న్యూస్) :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ముదిగొండ మండల వ్యవసాయ అధికారి వి. నాగేశ్వరరావు సూచించారు. వచ్చే యాసంగి సీజన్‌లో నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి, మొక్కజొన్న వంటి పంటలకు బదులుగా ఆరుతడి పంటలు, అపరాలు సాగు చేయాలని రైతులకు సూచించారు. వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని, విద్యుత్ సరఫరాలోనూ అంతరాయాలు ఏర్పడితే బోరుబావులపై ఆధారపడే రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు.ఈ నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగుపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. యాసంగిలో పెసర, కుసుమ వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం మండలంలో పెసర, కుసుమ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు మండలంలోని ఎడవల్లి, మేడేపల్లి, న్యూ లక్ష్మీపురం, ముత్తారం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మండల వ్యవసాయ అధికారి వి. నాగేశ్వరరావు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవోలు), గ్రామ సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.



మనం
జనం కోసం అక్షర యజ్ఞం..



# వైరా

వైరా - కారేపల్లి - కొణిజర్ల - ఏన్కూరు - జూలూరుపాడు

## కన్నీరు మిగిల్చిన తనయుడి మరణం

**– తండ్రికి ఇష్టమైన బట్టలు కొనిచ్చి.. క్షణాల్లోనే కానరాని లోకాలకు**



**వైరా, అక్టోబర్ 16 (మనం న్యూస్):** అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు ప్రయోజకుడై తమ కు అండగా నిలుస్తాడని ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ తల్లిదండ్రులకు తీరని శోకం మిగిలింది. రెక్కల కష్టంతో పెంచిన బిడ్డ భవిష్యత్తుపై ఎన్నో కలలు కన్న ఆ కుటుంబంలో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. తండ్రికి ఇష్టమైన బట్టలు కొనిచ్చి ఇంట్లోకి వెళ్లిన కొద్దిసేపటికే ఆ కుమారుడు విగత జీవిగా మారడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలో ముంచింది. ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు గండగలపాడుకు చెందిన సీపీఎం కౌన్సిలర్ కిన్నెర కృష్ణ కుమారుడు రాఘవ (19) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న రాఘవ రెండు రోజుల క్రితమే స్వగ్రామమైన గండగలపాడుకు వచ్చాడు. శుక్రవారం ఉదయం తన తండ్రికి ఇష్టమైన బటలు కొనిచ్చి ఇంట్లోకి వెళ్లిన కొద్దిసేపటికే ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే వైరాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని, అప్పటికే రాఘవ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కళ్లముందే తిరుగుతూ కబుర్లు చెప్పిన కొడుకు ఇక లేడనే నిజాన్ని ఆ తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు. కుమారుడి మరణవార్తతో తండ్రి కిన్నెర కృష్ణ, తల్లి విజయల రోదనలు మిన్నంటాయి. ఉన్నత చదువులు చదువుతూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరు కుంటాడని ఆశించిన కుమారుడు 19 ఏళ్లకే తనువు చాలించడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీ రవుతోంది. బిడ్డతో కలిసి చూడాలనుకున్న భవిష్యత్తు కలలన్నీ ఒక్కసారిగా చెదిరిపోవడంతో ఆ తలిదండ్రుల ఆవేదన పలువురిని కలచివేసింది. ఈ విషాద ఘటనతో గండగలపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న స్థానికులు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కృష్ణ నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. దుఃఖంలో ఉన్న కుటుంబ సబ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## సరస్వతి దేవి అవతారంలో చిన్నారులు



**కొణిజర్ల,అక్టోబర్ 16(మనం న్యూస్):** కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10వ సంవత్సరం దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిన్నారులు సరస్వతి దేవి అవతారంలో పూజల్లో పాల్గొన్నారు. చిన్నారులను సరస్వతి దేవి రూపంలో అందంగా అలంకరించి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## అక్రమంగా ఆవులను తరలిస్తున్న వాహనానికి బ్రేక్!

**– వాహనాన్ని అడ్డుకుని గోవులను గోశాలకు తరలించిన యువకులు**



**కారేపల్లి,అక్టోబర్16 (మనం న్యూస్):** రైతుల ముసుగులో కొంతమంది వ్యక్తులు గోవులను వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా స్థానిక యువకులు వాహనాన్ని వెంబడించి అడ్డుకు న్న ఘటన కారేపల్లి - ఇల్లందు ప్రధాన రహదారిలో ని సోలా ర్ ప్లాంట్ వద్ద శుక్రవార ం చేసు కుంది. ఖమ్మం ప్రాంతం నుంచి డీసీఎం వాహనంలో సుమారు 15 గోవులను, ఇల్లం దు మహబూబాబాద్ వైపు కొంతమంది వ్యక్తులు తరలిస్తుండగా గమనించిన కారేపల్లి యువకు లు వాహనాన్ని వెంబడించి, సోలార్ ప్లాంట్ వద్ద అటకాయించారు. ఈ క్రమంలో సమాచా రం అందుకున్న ఇల్లందు గో సంరక్షణ సమితి సభ్యులు కారేపల్లి విశ్వహిందూ పరిషత్తు సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని గోవులను తరలిస్తున్న వ్యక్తులను నిలదీశారు. తాము రైతులమని చెప్పుతూ పొంతన లేని సమాధానాలతో పాటు,వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గోవులను వాహనంతో పాటు ఖమ్మంలోని గొల్లగూడెం గోశాలకు తరలించా రు. ఈ కార్యక్రమంలో గో సంరక్షణ సమితి సభ్యులు విశ్వహిందూ పరిషత్తు సభ్యులు జంగా వెంకటేశ్వర్లు, వైభవ్ మనియార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాపై సీఎండీ సమీక్ష



**కొణిజర్ల,అక్టోబర్ 16 (మనం న్యూస్):** వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఐఏఎస్ శుక్రవారం ఖమ్మం సర్కిల్ పరిధిలోని 220/132/33 కేవీ పెద్దగోపతి విద్యుత్ ఉపకేంద్రాన్ని సందర్శించి సరఫరా పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ పనితీరు, విద్యుత్ సరఫరా స్థితిగతులను ఆయన పరిశీలించారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా వ్యవసాయ అవసరాలకు విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సాంకేతిక సమస్యలను గుర్తించిన వెంటనే పరిష్కరించి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని, క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఖమ్మం ఎస్‌ఈ శ్రీనివాస చారి, వైరా డీఈ (ఆపరేషన్స్), పెద్దగోపతి ఏఈ (ఆపరేషన్స్), టీజీ ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆత్మా ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ



**కామేపల్లి అక్టోబర్ 16 (మనం న్యూస్):** కామేపల్లి మండలం మద్దులపల్లి రైతు వేదికలో శుక్రవారం ఆత్మా సంస్థ ఆధ్వర్యంలో రైతులకు 'పూర్వ జ్ఞాన గుర్తింపు' శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు మాట్లాడుతూ సహజ వ్యవసాయ పద్ధతులు, కషాయాల తయారీ, వాటి వినియోగంపై రైతులకు విపులంగా వివరించారు. అధిక సాంద్రత పత్తి సాగు విధానం, భూసార పరిరక్షణ–యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రాబోయే ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా ఆరుతడి పంటలైన అపరాలు, నూనెగింజలు, సజ్జలు, జొన్నలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామార్పంచ్ పి. నాగమణి, ఫార్మర్స్ ట్రైనింగ్ సెంటర్ వ్యవసాయ అధికారులు ఇంటూరి భాస్కర్, శరత్ బాబు, వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త పావని, మండల వ్యవసాయ అధికారి తారాదేవి, బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ ఆనంద్ రావు, సహాయ వ్యవసాయ అధికారులు, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు దాసరి అరుణ, జస్వంత్ మరియు రైతులు సామ మోహన్ రెడ్డి, గట్టికొప్పుల నారాయణరెడ్డి, అంబటి శ్రీనివాస్ రెడ్డి, బోయినపల్లి అశోక్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, కాత్రాల రాంబాబు, మన్నెని వెంకటేశ్వర్లు, కర్లపాటి రాజు తదితరులు పాల్గొన్నారు

# ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ!

**– ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు**



**కారేపల్లి, అక్టోబర్ 16(మనం న్యూస్):** తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా బతుకమ్మ వేడుకలను అభివర్ణించవచ్చని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బానోతు పద్మ తెలిపారు. కారేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పద్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు,మహిళా సిబ్బందితో కలిసి వేపకాయల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు గ్రామపంచాయతీలకు చెందిన మహిళా కార్యదర్శులు ఈ వేడుకల్లో పాల్గొని తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి,సాంప్రదాయ వేషధారణతో బతుకమ్మ పాటలు పాడుతూ పండుగ వలె ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పద్మ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కార్యదర్శులతో కలిసి ఉత్సాహంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చొరవతో పల్లె,పట్నం అనే తేడా లేకుండా తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించుకోవడం జరుగుతున్నదని అన్నారు. ఈ వేడుకల్లో గేటు కారేపల్లి పంచాయతీ కార్యదర్శి కొత్తపల్లి అనూష,కోమట్లగూడెం కార్యదర్శి ఉషారాణి, కొమ్ముగూడెం కార్యదర్శి లోకేశ్వరి,సూర్యతండా కార్యదర్శి భార్గవి, తొడితలగూడెం కార్యదర్శి గౌతమి,అప్పాయిగూడెం కార్యదర్శి కృష్ణవేణి,భజ్యాతండా కార్యదర్శి ధారావత్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6 ఆఖరు!

**– అర్హులైన పట్టభద్రులు వెంటనే అప్లై చేసుకోవాలి**

**– కామేపల్లి తహశీల్దార్ శ్రీనివాసరావు పిలుపు**



**కామేపల్లి, అక్టోబర్ 16 (మనం న్యూస్):** కామేపల్లి మండల పరిధిలోని సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, అధి.కారులు, రాజకీయ నాయకులు, యువతీ యువకులు, పాత్రికేయ సమావేశంలో తహశీల్దార్ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలియజేశారు. రాబోయే పట్టభద్రుల ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకునేందుకు నవ ంబర్ 6వ తేదీ ఆఖరు తేదీగా నిర్ణయించినట్లు వెల్లడించారు. 2023 నవంబర్ 1వతేదీ నాటికి డిగ్రీ పూర్తి చేసి న అభ్యర్థులందరూ ఓటరు నమోదుకు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన వారు తమ డిగ్రీ సర్టిఫికెట్ తో పా టు అడ్రస్ ప్రూఫ్ కోసం ఆధార్ కార్డు,ఓటర్ ఐడీ కార్డులను జత చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవా లని సూచి ంచారు. గడువు ముగిసేలోగా అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం..



# మధిర

మధిర - ఎర్రుపాలెం - బోనకల్- చింతకాని - ముదిగొండ

## కాంగ్రెస్ అసమర్థ పాలన వల్లనే రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం



**మధిర, అక్టోబర్ 16(మనం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలన వల్లనే రాష్ట్రం లో కరెంటు కష్టాలు మొదలయ్యాయి అని జడ్పీ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గం ఇన్చార్జి లింగాల కమల్ రాజు అన్నారు.స్థానిక నాయకులు తో కలిసి మధిర టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంమీడియా మాట్లాడుతూ చీకటి రాష్ట్రం నుండి 24గంటలు విరామం లేకుండా కరెంటు ఇచ్చే విధంగా రాష్ట్రాన్ని కెసిఆర్ తయారు చేశారని తెలిపారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 3సంవ త్సరాలకే అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. అధికారులు మీద చర్యలు తీసుకుంటే పరిష్కారం కాదని సంబంధిత మంత్రి పై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం మానుకుని పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు కెసిఆర్ పాలనలో రాష్ట్రంలో ఎటువంటి కోతల లేకుండా విద్యుత్ అందించారు ,తెలంగాణ రాష్ట్రంలో 7778 మెగా విద్యుత్ ఉత్పత్తి అవుతుంది .19,464 మెగావాట్లకు అనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పెంచారు.కెసిఆర్ దిగిపోయే నాటికి మిగులు విద్యుత్తుతో అప్పగించడం జరిగింది 24 గంటల పాటు బిఆర్ఎస్ పాలనలో ఎటువంటి కోతలు లేకుండా విద్యుత్ అందించారు. విద్యుత్ అందించడం చేతకాని కమిషన్ల శాఖ మంత్రి గా రాష్ట్రంలో ఖ్యాతి గడించిన విద్యుత్ శాఖ మంత్రిని మంత్రివర్గంలో డిస్మిస్ చేయాలి.పరిపాలన చేతకాక ప్రజలను ఇబ్బందులు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం,కరోనా కష్టకాలంలో కూడా కెసిఆర్ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంది ఎల్ నినో వస్తే దానికి ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలు తీసుకోకుండా పంటలు వేయొద్దు కరెంటు పొదుపుగా వాడండి అని కాంగ్రెస్ ప్రభుత్వం కాకమ్మ కబుర్లు చెబుతున్నారు .కాంగ్రెస్ తెచ్చిన కరువు ప్రస్తుతం నెలకొంది. అందుకే ఎండిపోయిన పంట పొలాలకు నష్టపరిహారం ఇవ్వాలి. కరెంటు కోతలను ఎత్తి వేయాలి. సమావేశంలో మధిర మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు.నాగేశ్వరరావు , పట్టణ మాజీ కార్యదర్శి అరిగె. శ్రీనివాస రావు కౌన్సిలర్ వైవి.అప్పారావు శివాలయం కమిటీ మాజీ చైర్మన్ వంకాయలపాటి.నాగేశ్వరరావు నాయకులు పల్లపాటి.కోటేశ్వర్ రావు నాగులంచ.రామారావు చీదిరాల.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష

**– అధిక సంఖ్యలో పాల్గొనాలని ఉపాధ్యాయులకు టిఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు పిలుపు**



**ఎర్రుపాలెం,అక్టోబర్ 16 (మనం న్యూస్):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అక్టోబర్ 17 న ఇందిరాపార్క్ ధర్నాచౌక్ లో నిర్వహిస్తున్న ఉపాధ్యా యుల సామూహిక నిరాహారదీక్షలో జిల్లా లోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈరోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మీనవోలు నందు జరిగిన టిఎస్ యుటిఎఫ్ ఎర్రుపాలెం మండల కమిటీ సమావేశం లో టిఎస్ యుటిఎఫ్ జిల్లాకార్యదర్శి అను మోలుకోటేశ్వరరావు ఎర్రుపాలెం మండల అధ్యక్షప్రధానకార్యదర్శులు కంచం శ్రీనివాసరావు నంద్రు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎస్టీఎఫ్ఐ పిలుపు మేరకు అన్ని రాష్ట్రాల రాజధాని నగరాల్లో ఒకరోజు సా మూహిక నిరాహార దీక్ష చేపట్టాలని తీర్మానించిన మేరకు హైదరా బాద్ లో టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో ఒకరోజు సామూహిక నిరాహార దీక్ష నిర్వహిస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం పరిధి లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలైన విద్యాహక్కు ఆర్టీఈ చట్టానికి ముందు నియమితమైన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయి స్తూ పార్లమెంటులో చట్ట సవరణ చేయాలని ఉపాధ్యా యుల పాలిట శాపంగా పరిణమించిన సామాజిక ఆర్థిక భరోసా లేని కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఆ మేరకు పిఎఫ్ ఆర్డీఏ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.విద్యా రంగాన్ని ప్రైవేటు కార్పొరేట్ పరం చేసేలా ఉన్న ఎన్ఈపి -2020 నూతన జాతీయ విద్యావిధానా న్ని రద్దు చేసి రాజ్యాంగ విలువలు ప్రతిబింబి ంచేలా శాస్త్రీయ విధా నాలను తీసుకురావాలని అదేవిధంగా ఇన్కంటాక్స్ స్లాబులను సవరి ంచి మధ్యతరగతి ఉద్యోగులపై పన్ను భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.కెజిబివి యుఆర్ఎస్ లలో కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి వారిని క్రమబద్ధీకరణ చేయాలని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ తలపెట్టిన ఈ సామూహిక నిరాహార దీక్ష లో జిల్లాలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రకటన విడుదల చేసిన వారిలో మండల ఉపాధ్య క్షులు టి రత్నమ్మ నీలం సైదారావు కోశాధికారి టి వెంకటకృష్ణ సుధాకర్ సతీష్ ఎన్ సాంబశివారెడ్డి సిహెచ్ శివపార్వతి కాజా మొహిద్దీన్ జీవన్ భరత్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాల్లో దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు

**– అమ్మవారికి తొమ్మిది చీరలు బహూకరించిన భూక్యా రవి, జ్యోతి దంపతులు**



**బోనకల్, అక్టోబర్ 16 :(మనం న్యూస్):** బోనకల్ గ్రామంలోని మాజీ జెడ్పిటిసి బానోత్ కొండ కాంప్లెక్స్ రోడ్లో ఎస్టీ కాలనీ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా.. గిరిజన కాలనీకి చెందిన భూక్యా రవి , జ్యోతి దంపతులు మరియు వారి కుమారుడు ఉదయ్, కుమార్తె నిఖితతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భూక్యా రవి -- జ్యోతి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి తొమ్మిది చీరలను భక్తిపూర్వకంగా బహూకరించారు.ఈ పూజా కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు, పురుషులు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి సమర్పించిన చీరలతో విశేష అలంకరణ చేపట్టి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పూజల అనంతరం భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందుతూ తీర్థప్ర సాదాలు స్వీకరించారు.నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గామాత దగ్గర భక్తిమయ వాతావరణం నెలకొంది. అమ్మవారి కృపతో ప్రజల ందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.ఫ్రెండ్స్ యూత్ కమిటీ సభ్యులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొని ఉత్సవాలను భక్తిపారవశ్యంతో జరుపుకున్నారు.



## రేపల్లెవాడలో భూముల రీ సర్వే కార్యక్రమం ప్రారంభం

**–భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే కీలకం...**

**– పారదర్శకంగా భూముల వివరాల నమోదు**

**ఎర్రుపాలెం, అక్టోబర్ 17( మనం న్యూస్):** రేపల్లెవాడ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమాన్ని రేపల్లెవాడ గ్రామంలో కంట మహేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రారం భించారు. ఈ కార్యక్రమం ద్వారా భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూ రికార్డుల నమోదు ప్రక్రియను చేపట్టనున్నారు.ఈ కార్యక్రమంలో రేపల్లెవాడ సర్పంచ్ మదు పల్లి అంబికా రాంప్రసాద్, తహసీల్దార్ కరుణశ్రీ, సర్వేయర్ నవీన్, జీపీఓ కిరణ్, గ్రామ కార్య దర్శి రామారావు పాల్గొన్నారు.అలాగే జిల్లా కాంగ్రెస్ నాయకులు మదుపల్లి భాస్కర్, బంధం కృష్ణ, మదుపల్లి కిరణ్ బాబు, బండి శ్రీనివాసరావు, మదుపల్లి వెంకటేశ్వర్లు, నాగబండి వెంకటనారాయణ, ఎటుకూరి మోహన్ రావు, సామినేని శ్రీనివాసరావు, కట్టా తుత్తురు, మదుపల్లి రమేష్, లక్ష్మీపతి, రాంబాబు, కొమ్మనే ప్రసాద, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## గాంధీ భవన్‌లో మండల కాంగ్రెస్ పార్టీ బలోపేతం పై చర్చలు



**ఎర్రుపాలెం, అక్టోబర్ 16 (మనం న్యూస్):** అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి సమావేశమయ్యారు ఈ సందర్భంగా ఎర్రుపాలెం మండల పరిధిలోని గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల కమిటీలు మండల కాంగ్రెస్ కమిటీ సభ్యుల నియామకాలు పార్టీ సంస్థాగత నిర్మాణం తదితర అంశాలపై చర్చించి కమిటీల ఏర్పాటు ప్రక్రియకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఎర్రుపాలెం మండలంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ గ్రామ కమిటీలు మరియు మండల కమిటీని పటిష్టంగా నిర్మించడమే లక్ష్యంగా నాయకులు ముందుకు సాగుతున్నారు.

## నాగులవంచలో ఆధ్యాత్మిక శోభ.. వైభవంగా హోమగుండం పడిపూజ!



**చింతకాని అక్టోబర్ 17( మనం న్యూస్):** నాగులవంచ గ్రామంలోని దొరవారి గడి సెంటర్ భక్తి పారవశ్యం తో పులకించిం ది. హోమగుండం పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో ఆ ప్రాం తమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొ ంది. రంగురంగుల విద్యుత్ దీపాల అల ంకరణలు, భవాని స్వాముల సందడితో దొరవారి గడి సెంటర్ శోభాయమానంగా మారిం ది.ఈ కార్యక్రమంలో భవాని స్వాములు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. విద్యుత్ దీ పాల వెలుగులు, పూజా కార్యక్రమాలతో గడి సెంటర్ ఆధ్యాత్మిక కళను సంతరించుకు ంది. భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయాల సమ్మేళనంగా సాగిన భక్తులను ఆకట్టుకుంది.

మనం




# సత్తుపల్లి

సత్తుపల్లి మున్సిపాలిటీ - సత్తుపల్లి మండలం - వేంసూరు - పెనుబల్లి

## చలమాల సూర్యనారాయణ సేవలు చిరస్మరణీయం

### – 43వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు




**పెనుబల్లి అక్టోబర్ 16(మనం న్యూస్ ):** స్థానిక పెనుబల్లి మండల సీపీఎం పార్టీ కార్యాలయంలోని చలమాల సూర్యనారాయణ భవన్‌లో కామ్రేడ్ చలమాల సూర్యనారాయణ 43వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఆయన చేసిన ప్రజా సేవలను, పేదలు, కార్మికులు, రైతుల కోసం ఆయన సాగించిన పోరాటాలను స్మరించుకున్నారు.సూర్యనారాయణ మరణించి 43 సంవత్సరాలు గడిచినా, నేటికీ ప్రతి సంవత్సరం ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఆయన ఆశయాలను గుర్తుచేసుకుంటున్న కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. ప్రజల కోసం ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు చలమాల విఠల్‌రావు మాట్లాడుతూ, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలపై వాతావరణ ప్రభావం, భవిష్యత్తులో ఎదురయ్యే కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి కొరత, సాగునీటి సమస్యలు, పంటల సాగులో ఇబ్బందులు తలెత్తే అవకాశాలను ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. ముఖ్యంగా రైతులు, పేద ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, కరువు సమస్యను ఎదుర్కొనేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని విఠల్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. తాండ్ర రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వంగా గిరిజాపతిరావు, మల్లెల శ్రీనివాసరావు, అన్నపురెడ్డి లక్ష్మయ్య, మిద్దె స్వామి, చీపి వెంకటేశ్వరరావు, మోటపోతుల నరసింహారావు, చలమాల నరసింహారావు, తడికమళ్ల చిరంజీవి, పంతంగి వెంకటేశ్వరరావు, బండి నరసింహారావు, కాటిని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మినపల్లిలో ఘనంగా కొమ్మిని పుల్లమ్మ దశదినకర్మ

### – పెద్దఎత్తున తరలివచ్చి నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు



**కామేపల్లి అక్టోబర్ 16 (మనం న్యూస్):** కామేపల్లి మండలం కొమ్మినపల్లి గ్రామంలో కొమ్మిని పుల్లమ్మ దశదినకర్మ కార్యక్రమం అత్యంత శోకతప్త వాతావరణం లో, బంధుమిత్రులు మరియు శ్రే యోభిలాషుల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సంతాప సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి అమరజీవి పుల్లమ్మకు ఘన నివాళులర్పించారు.ఈ పవిత్ర కార్యక్రమంలో కామేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, డిసిసి కార్యదర్శి ఫతే మహమ్మద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు తోటకూరి శివయ్య ముఖ్య అతిథులుగా విచ్చేసారు. ముందుగా వారు పుల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాం జలి ఘటిం చారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సాను భూతిని తెలియజేయడంతో పాటు అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడు తూ.. పుల్లమ్మ గారితో తమకున్న ఆత్మీయ అనుబంధాన్ని స్మరించుకున్నారు. వారు గ్రామానికి, సమాజానికి అందించిన విశిష్ట సేవలు ఎనలేనివని, వారి జ్ఞాపకాలు నిరంతరం నిలిచిపోతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ, మండల స్థాయి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొని, దివంగత పుల్లమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవి పూజలు



**కామేపల్లి అక్టోబర్ 16 (మనం న్యూస్):** కామేపల్లి ఎంపీ సెంటర్ తో పాటు రామకృష్ణాపురంలోని పలు ఆలయాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు దుర్గామాత విజ్ఞాన ప్రదాయిని అయిన సరస్వతీ దేవి రూపంలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కామేపల్లి ఎంపీ సెంటర్‌లోని మందిరంలో ఉదయం నుంచే మహిళలు, విద్యార్థుల సందడి నెలకొంది. మహిళలు విశేషంగా పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించడమే కాకుండా భక్తిశ్రద్ధలతో హోమంలో పాల్గొన్నారు. అదేవిధంగా రామకృష్ణాపురంలోని గురు హరి హర క్షేత్రం, శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయాల్లో మహిళలు కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. విద్యాబుద్ధులు ప్రసాదించే సరస్వతీ దేవి అమ్మవారి అలంకారాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ప్రత్యేక పూజలు, పసిపిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమాలు జరిపించారు. ఉత్సవాల్లో భవాని మాత దీక్షాపరుల పూజలు, భక్తుల కోలాహలంతో గ్రామాలన్నీ భక్తి పారవశ్యంతో పులకించి, ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకున్నాయి.

## నేడు కొత్త లింగాలలో ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష

**కామేపల్లి, అక్టోబరు 16 (మనం న్యూస్):** కామేపల్లి మండలం కొత్త లింగాల గ్రామంలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో శనివారం మధ్యాహ్నం 2:00 గంటలకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షా సమావేశం, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి ఇల్లందు ఎమ్మెల్యే, శాసనసభల అంచనాల కమిటీ చైర్మన్ కోరం కనకయ్య, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ డైరెక్టర్ రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారు. ఈ సమావేశంలో ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదుపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన అనంతరం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తారు. కావున కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, మండల-గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు మరియు పట్టభద్రులైన ఓటర్లు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కామేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు ఒక ప్రకటనలో కోరారు.





## 22ఏ పేరుతో రైతుల్లో గందరగోళం..

### – ఎస్ఐఆర్ పేరుతో ఓటర్లలో ఆందోళన!
### – రైతుల భూములపై భయాందోళనలు తొలగించాలి.. వ్యవసాయ కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించాలి
### – వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్‌రావు డిమాండ్

**బోనకల్, అక్టోబర్ 16 : (మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం 22ఏ పేరుతో రైతులను గందరగోళానికి గురిచేస్తోందని, తమ భూములు ఎక్కడ కోల్పోతామోనని రైతులు భయాందోళనలకు గురవుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్‌రావు అన్నారు. మరోవైపు ఎస్ఐఆర్ పేరుతో హరిజనులు, గిరిజనులు, మైనార్టీల ఓట్ల తొలగింపునకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. శనివారం బోనకల్ మండల కేంద్రంలోని వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో మధిర డివిజన్ వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ సమావేశం డివిజన్ అధ్యక్షులు బంధం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో పొన్నం వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ, భారతదేశంలో జన్మించి, ఎన్నో ఏళ్ళుగా ఓటు హక్కును వినియోగించు కుంటున్న ప్రజలు సైతం తమ ఓటు హక్కును నిరూపించుకోవాల్సిన పరిస్థితి కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఓటర్లను ఆందోళనకు గురిచేస్తోందని విమర్శించారు. ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు.

**ఎల్‌నినో ప్రభావంతో సాగు, తాగునీటికి కొరత**

వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి ఎర్ర శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. సాగునీరు, తాగునీటి కొరత కారణంగా రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల భవిష్యత్తులో ఆహార కొరత ఏర్పడటమే కాకుండా వ్యవసాయ కూలీలకు పనులు దొరకని పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ కూలీలకు నిరంతరం పని కల్పించాలని, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మధిర డివిజన్ కార్యదర్శి పాపినేని రామనరసయ్య, డివిజన్ అధ్యక్షులు బంధం శ్రీనివాసరావు మాట్లాడారు. డివిజన్ కమిటీ సభ్యులు బట్టు పురుషోత్తం, వేల్పుల భద్రయ్య, మంద సైదులు, గామాసు జోగయ్య, వెంకటరామయ్య, తెల్లాకుల శ్రీనివాసరావు, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.



# కన్నుల పండుగగా అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్ట..

**– హాజరైన ఎమ్మెల్యే రాగమయి,**
**మాజీ స్పీకర్ మధుసూదనా చారి..**
**– వేలాదిగా తరలివచ్చిన భక్తులు..**







**తల్లాడ, అక్టోబర్ 16 (మనం న్యూస్):** మండల పరిధిలోని నూతనకల్లు గ్రామంలో హరిహర సుత అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్టా మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ముఖ్య అతిథులకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు మంగళవాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల శరణుఘోషతో నూతనకల్లు గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథు లు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయాన్ని ప్రతిష్ఠించడం శుభపరిణామమని, స్వామివారి కృపాకటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యా లు, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను, ప్రశాంతతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు మరియు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అయ్యప్ప భక్తులు, మహిళలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుర్రాల రమణారెడ్డి, గణేశుల రవి, అడపా అనిల్ చౌదరి, వివిధ గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ..

**– సర్పంచ్ పెరిక నాగేశ్వరావు**





**తల్లాడ, అక్టోబర్ 16 (మనం న్యూస్):** తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరావు ఆధ్వర్యంలో గ్రామంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో ఉత్సాహంగా సంబురాలు జరుపుకున్నారు. మహిళల సందడి, బతుకమ్మ పాటలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సర్పంచ్ పెరిక నాగేశ్వరావు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవా నికి, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలంతా ఒకచోట చేరి ఆనందంగా పండుగను జరుపుకోవడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేకత అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ వాటి గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, తల్లాడ గ్రామం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అభివృద్ధితో వి లసిల్లాలని సర్పంచ్ పెరిక నాగేశ్వరావు ఆకాంక్షించారు. ఈ కార్యక్ర ˇమంలో డి ఎల్ పి వో విజయ లక్ష్మి, తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి, ఎంపీడీఓ అంబటి శ్రీధర్ రాజు, ఎంపీవో శ్రీహరి క్రిష్ణ,ఎంపీడీఓ ఆఫీ స్ సుపరిడెంట్ వాణి, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మ రెడ్డి, పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

**చింతకాని, అక్టోబర్ 16 (మనం న్యూస్):** చింతకాని మండల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన మనశీ న్యూస్ జొన్నలగడ్డ మల్లేశ్వరి, మండల కార్యదర్శిగా ఎన్నికైన సీకే న్యూస్ పిచ్చయ్యలను తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ చింతకాని మండల నాయకు లు,ఐతం ఆదినారాయణ, దర్శ బాలకృష్ణ, వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ నారుపోగు నాగయ్య, ఐతం వెంకటేష్ తదితరులు పాల్గొ న్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యద ర్శులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకు వస్తూ జర్నలిజం రంగంలో మరింత ముందు కు సాగాలని వారు ఆకాంక్షించారు.



మనం
జనం కోసం అక్షర యజ్ఞం..



# కల్లూరు

కల్లూరు మున్సిపాలిటీ - కల్లూరు మండలం - తల్లాడ



## తల్లాడ మండల అధికారులకు వాలీబాల్ క్రీడాకారులు వినతి

**తల్లాడ, అక్టోబర్ 16 (మనం న్యూస్):** తల్లాడ తహసీల్దార్ కార్యాలయం ప్రక్కన ఉన్న స్థలంలో గత 40 సంవత్సరాలుగా మేము క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసుకుని వాలీబాల్ ఆడుతున్నాము. ఈ మైదానం ద్వారా ఎంతో మంది క్రీడాకారులు నైపుణ్యం సంపాదించి ఉద్యోగాలు సాధించారు. ఈరోజుకీ ఎంతో మంది యువత శారీరక దృఢత్వం, ఆరోగ్యం, ఆనందం కోసం ఈ మైదానాన్ని నమ్ముకుని ఉన్నారు. భవిష్యత్తులో కూడా చాలామంది ఉద్యోగాలు సాధించేందుకు ఇక్కడ సాధన చేస్తున్నారు. ?2011 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో, ఈ మైదానంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌కు జిల్లా కలెక్టర్, కమిషనర్ ప్రారంభించడం జరిగింది. అంతేకాకుండా అప్పటి సీఐ, ఎస్సై కూడా ఈ టోర్నమెంట్‌లో పాల్గొని క్రీడాకారులను అభినందించారు. అప్పట్లో గ్రామ పంచాయతీ, అధికారుల ప్రోత్సాహంతో ఈ ఆట స్థలం ప్రసిద్ధి చెందింది. ఇటీవల ఈ క్రీడా స్థలం ప్రక్కన ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు జరుగుతున్నాయి. ఆట నియమాల ప్రకారం వాలీబాల్ క్రీడా ప్రాంగణానికి చుట్టూ సర్వీస్ జోన్ కనీసం 20 అడుగులు ఉండాలి. కానీ ప్రస్తుతం ఇక్కడ కేవలం 13 అడుగులు మాత్రమే ఉంది. ఇటువంటి పరిస్థితిలో మరింత స్థలాన్ని ఆక్రమించడం లేదా నిర్మాణాల వల్ల సర్వీస్ జోన్ తగ్గినట్లయితే, క్రీడాకారులు ఆడేందుకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. ఈ క్రీడా ప్రాంగణం లో ఉన్న సర్వీస్ జోన్ నుండి ఎలాంటి నూతన నిర్మాణాలు, రహదారులు నిర్మించకుండా ఆటంకాన్ని నివారించాలి. గత 40 ఏళ్లుగా అధికారుల అభినందనలు పొందుతూ వస్తున్న ఈ స్థలాన్ని గ్రామ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, తల్లాడ వాలీబాల్ క్రీడా ప్రాంగణం గా గుర్తిస్తూ గ్రామ పంచాయతీలో అధికారిక తీర్మానం ఆమోదించి, స్థలాన్ని పూర్తిగా క్రీడలకే కేటాయించాలి. క్రీడాకారుల భవిష్యత్తును కాపాడేలా సానుకూల నిర్ణయం తీసుకుని, తగిన తీర్మాన ప్రతిని అందించగలరని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో చల్లా వెంకట్, ధరావత్ కృష్ణ, మొక్క సైదులు, షేక్ మెహరాజ్, నాయకులు షేక్ యూసుఫ్, జూకూరి శ్రీను, నాగేశ్వరరావు,సంపత్, పెరిక శ్రీను, గుంటుపల్లి రవి, కృష్ణ,మనోజ్, పుల్లారావు, అజయ్ చక్రవర్తి,శివ, మదార, పాల్గొన్నారు.

## ఓటు హక్కును నమోదు చేసుకోవాలి..

**– తహశీల్దార్ కరుణాకర్ రెడ్డి..**



**తల్లాడ, అక్టోబర్ 16 (మనం న్యూస్):** పట్టబద్రులందరూ తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తల్లాడ తహశీల్దార్ కరుణాకర్ రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా డిగ్రీ పట్టా పొందిన ప్రతి ఒక్కరు ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా ఉన్న ఓటర్లులందరూ ఓటు హక్కు చేసుకోవాలని వెల్లడించారు.

## తుమ్మలపల్లి వెంకటేశ్వరావుకు పరామర్శ..



**తల్లాడ, అక్టోబర్ 16 (మనం న్యూస్):** తల్లాడ మండలంలోని అన్నారు గూడె ం గ్రామానికి చెందిన సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల పల్లి వెంకటేశ్వరావును తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) పరామర్శించారు. ఈ విషయం తెలుసుకున్న నాయకులు ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మారెళ్ళ దేవేంద్రరావు, వార్డు మెంబర్ సూదా హనుమంతరావు, కొత్తపల్లి దానయ్య ఉన్నారు.

# మనం కొత్తగూడెం



కొత్తగూడెం కార్పొరేషన్ - సింగరేణి

## సమాజంలో సుఖశాంతులు వెల్లివిరియాలి

**– భక్తిభావంతో పాటు సేవా దృక్పధాన్ని అలవర్చుకోవాలి**
**– అన్నదానం అత్యంత పవిత్రమైన కార్యం**
**– కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 16 (మనం న్యూస్) :** సమాజంలో సుఖశాంతులు వెల్లివిరియాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణ పరిధిలోని గాజులరాజం బస్తీ, నెహ్రూ బస్తీ తదితర ప్రాంతాల్లో ఉత్సవ కమిటీలు ప్రతిష్టించిన దుర్గాదేవి అమ్మవారి మండపాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, అనంతరం నిర్వహించిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటామన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పండుగలు, ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనతో పాటు సమాజహితమైన సేవా భావాన్ని, పరస్పర సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పేదలకు ఆకలి తీర్చే అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అత్యంత అభినందనీయమని కొనియాడారు. బస్తీలలో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో అసమానతలు తొలగి, సర్వజనుల సంక్షేమం వర్ధిల్లాలని ఆయన కోరారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్లు, నాయకులు గద్దం శాంతిప్రియ, దాసరి శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, గద్దం రాజయ్య, ప్రభాకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. మరొకరికి గాయాలు



**లక్ష్మీదేవిపల్లి,అక్టోబర్ 16 (మనం న్యూస్):** పోలీస్ స్టేషన్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంటి అనిల్ ప్రకాష్ మృతి చెందగా, కాకాటి సందీప్ గాయపడ్డాడు. ఇల్లందు నుంచి కొత్తగూడెం వైపు వస్తున్న కారు అతివేగంగా వచ్చి రోడ్డు పక్కన నిలబడి ఉన్న అనిల్ ప్రకాష్‌ను ఢీకొట్టడంతో పాటు, పక్కనే ఉన్న ఆటోను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అనిల్ ప్రకాష్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై లక్ష్మీదేవిపల్లి పోలీసులు కారు డ్రైవర్ తంగేళ్లపల్లి శ్రీధర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ, ట్రాఫిక్ నిబంధనలను అనుసరించాలని పోలీసులు సూచించారు.

# ఓటు హక్కు పరిరక్షణకు యువత ఉద్యమించాలి

**– ఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి..**
**– ఢిల్లీలో నిర్బంధాలు ఆపాలి**
**– డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్**





**కొత్తగూడెం, టౌన్ అక్టోబర్ 16 (మనం న్యూస్) :** దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై ప్రజల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని డీవైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హుల ఓటు హక్కుకు నష్టం కలగకుండా చూడాలని, ఢిల్లీలో ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న యువత, విద్యార్థులపై నిర్బంధాలు ఆపాలని కోరారు. శుక్రవారం కొత్తగూడెంలోని టీచర్స్ భవన్‌లో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మూడో మహాసభ నిర్వహించారు. మహాసభకు అధ్యక్ష వర్గంగా లిక్కి బాలరాజు, కుమార్ అధ్యక్షత వహించగా, డీవైఎఫ్ఐ జెండాను లిక్కి బాలరాజు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోట రమేష్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. దళితులు, మైనారిటీలు, గిరిజనులు, పేదలు సహా అన్ని వర్గాల ప్రజల ఓటు హక్కును కాపాడాలని, జాబితా సవరణలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.

**ఢిల్లీలో నిర్బంధాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం**

ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలపై ప్రభుత్వం, పోలీసుల వ్యవహారశైలి ఆందోళనకరంగా ఉందని కోట రమేష్ విమర్శించారు. అక్టోబర్ 10న జరిగిన నిరసన సందర్భంగా వేలాది మందిని పోలీసులు నిర్బంధించారని, అక్టోబర్ 13న ఉద్యమ నాయకులను అదుపులోకి తీసుకోగా, అక్టోబర్ 14న ఇద్దరు నాయకులను ఐదు రోజుల న్యాయ నిర్బంధానికి పంపినట్లు వార్తలు వెల్లడించాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందని, ప్రశ్నించే గొంతులను అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నెరవేర్చలేదని విమర్శించారు. నిరుద్యోగం, విద్యా సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేసేలా చూడాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం యువత, విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత ముందుకు రావాలి**

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ మాట్లాడుతూ, యువత విద్య, ఉపాధి, ఉద్యోగాల కోసం పోరాడటంతో పాటు రాజ్యాంగ హక్కులు, ఓటు హక్కు పరిరక్షణకు కూడా ముందుకు రావాలని అన్నారు. రాజ్యాంగబద్ధ సంస్థలు రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా పనిచేయాలని, ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడటం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఢిల్లీలో నిరసనకారులపై నిర్బంధాలు, ఉద్యమ నాయకుల అరెస్టులు ప్రజాస్వామ్య హక్కులపై ఆందోళనలను పెంచుతున్నాయని అన్నారు. ఓటర్ల జాబితాలో పేర్ల తొలగించడంపై ప్రజలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం, ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై పారదర్శకమైన విచారణ జరిపించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని కోరారు. నిరుద్యోగం, విద్యా సమస్యలు, ఉద్యోగాల కల్పనతో పాటు రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం యువత ఐక్యంగా పోరాడాలని హరికృష్ణ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజాస్వామిక శక్తులన్నీ ఏకమై ఉద్యమించాలని అన్నారు.

**పలువురు నాయకుల పాల్గొనడం**

ఈ మహాసభలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లిక్కి బాలరాజు, జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ, జిల్లా నాయకులు లాకవత్ కుమార్, ధారావత్ శివ, చింతలపూడి శ్రావణి, కిషోర్, బాలాజీ, భూపేంద్ర, రాంబాబు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, మాజీ డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.డి. జలాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నాగకృష్ణ, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి షణ్ముఖ్ తదితరులు మహాసభకు సంఘీభావం తెలిపారు.

# షభాష్ సురేష్.. దేశాన్ని కాపాడాలంటే నీ లాంటి యువత ముందుండాలి!

**– ఢిల్లీలో అజ్మీర సురేష్ నాయక్‌కు రాహుల్ గాంధీ అభినందనలు**



**కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 16, (మనం న్యూస్) :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని న్యూఢిల్లీలోని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్ కలిశారు. దేశంలో ఓటు హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం తాను చేస్తున్న పోరాటం గురించి వివరించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చేపడుతున్న నిరసనలు, ఓటు చోరీ ఆరోపణలపై సాగిస్తున్న ఉద్యమం గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ "షాబాష్ సురేష్.. దేశాన్ని కాపాడాలంటే నీ లాంటి ఉద్యమ యువత ముందుకు రావాలి" అంటూ అభినందించి ప్రోత్సహించినట్లు సురేష్ నాయక్ తెలిపారు. ఈ ప్రోత్సాహం తనకు మరింత స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు.

**భద్రాద్రి నుంచి ఢిల్లీ వరకు.. విద్యార్థి ఉద్యమానికి గుర్తింపు!**

విద్యార్థుల సమస్యలతో పాటు ప్రజల ఓటు హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతానని అజ్మీర సురేష్ నాయక్ తెలిపారు. యువత ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని ఆయన అన్నారు. ప్రజల ఓటు హక్కులను కాపాడేందుకు బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆగదు!**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే తమ డిమాండ్ నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని సురేష్ నాయక్ తెలిపారు. ప్రజల హక్కుల కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గబోమని పేర్కొన్నారు. "పదవుల కోసం కాదు.. ప్రజల హక్కుల కోసం మా పోరాటం! ఓటు హక్కుల పరిరక్షణ కోసం మా గళం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మా సంకల్పం!" అని అజ్మీర సురేష్ నాయక్ స్పష్టం చేశారు.

# ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత

- నీటి వృథాను అరికట్టాలి.. ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి
- చెట్ల పెంపకంతోనే భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం
- జమాతే ఇస్లామీ హింద్ సభ్యుడు షేక్ అబ్దుల్ బాసిత్



**చుంచుపల్లి, అక్టోబర్ 16 మనం న్యూస్:** ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జమాతే ఇస్లామీ హింద్ సభ్యుడు షేక్ అబ్దుల్ బాసిత్ పిలుపునిచ్చారు. నీటిని పొదుపుగా వినియోగించడం, ఆహారాన్ని వృథా చేయకుండా చూడటం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, మొక్కలను నాటడం వంటి చర్యలతో పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. పవిత్ర శుక్రవారం సందర్భంగా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మస్జిద్ ఏ ఖుబాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో పలు ప్రాంతాల్లో వర్షపాతం తగ్గి నీటి కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును విలువైనదిగా భావించాలని సూచించారు. ఇళ్లలో, బహిరంగ ప్రదేశాల్లో, మతపరమైన సంస్థల్లో నీటిని వృథా చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

**నీటి సంరక్షణతోనే భవిష్యత్తుకు భరోసా:**

ప్రవక్త ముహమ్మద్ (స) సుమారు 1,500 సంవత్సరాల క్రితమే నీటి సంరక్షణ, పరిశుభ్రత ప్రాధాన్యతను బోధించారని అబ్దుల్ బాసిత్ గుర్తుచేశారు. నీటి వనరులను కలుషితం చేయకుండా కాపాడుకోవడంతో పాటు, అవసరానికి మించి నీటిని వినియోగించకూడదని సూచించారు. నీటి సంరక్షణను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని అన్నారు.

**మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యత**

చెట్లను నరికివేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని, వృక్ష సంపదను సంరక్షించడం ద్వారా మానవులతో పాటు పశుపక్ష్యాదులకు కూడా మేలు చేసినవారమవుతామని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని ప్రేమించడం, జీవరాశుల పట్ల కరుణ చూపడం వంటి విలువలను ఆచరణలో పెట్టాలని సూచించారు.

**ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలి**

ప్లాస్టిక్ వినియోగం, అవసరానికి మించి వాహనాల వాడకం వల్ల గాలి, నీరు, నేల కాలుష్యం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ఆహారాన్ని వృథా చేయకపోవడం, సహజ వనరులను పొదుపుగా ఉపయోగించడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని కోరారు. నమాజ్, రోజా, హజ్ వంటి మతపరమైన ఆచారాలతో పాటు ఇతరుల సంక్షేమం, సామాజిక బాధ్యత, ప్రకృతి పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని వివరించారు. వ్యక్తిగత ఆరాధనతో పాటు సమాజానికి మేలు చేసే పనులు చేయడం కూడా ముఖ్యమని అన్నారు.

**ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పెంపు :**

వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని అబ్దుల్ బాసిత్ సూచించారు. దీనివల్ల భూగర్భ జలాల పెంపునకు అవకాశం ఉంటుందని తెలిపారు. నీటి సంరక్షణ, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు వంటి చిన్నచిన్న చర్యలే భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణకు బలమైన పునాదులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ ఇమామ్ మజ్హర్, అధ్యక్షుడు అజీజ్ ఖాన్, షబ్బీర్, షమీం, సోనూబాయ్, మదార్, రఫీ, మున్నా, షఫీ, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# కరువు కోరల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

- రైతులకు నష్టపరిహారం చెల్లించాలి
- ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్



**కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 16, (మనం న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, పంటలు ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై జిల్లా కలెక్టర్ అఖిలపక్ష సమావేశం నిర్వహించి, కరువు నివారణకు ప్రభుత్వం తీసుకోనున్న చర్యలను ప్రజలకు వివరించాలని కోరారు. వ్యవసాయం దెబ్బతినడంతో గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులకు పనులు దొరకడం కష్టంగా మారిందని, జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. కరువు పరిస్థితులకు తోడు అక్రమ ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు మరింత అడుగంటిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే అప్రకటిత విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయని, రానున్న రోజుల్లో విద్యుత్ సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. వ్యవసాయ బోర్ల కింద సాగు కూడా కష్టతరంగా మారిందని, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులకు ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలను కరువు పరిస్థితుల నుంచి రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇసుక రవాణా కారణంగా దెబ్బతిన్న భద్రాచలం, పినపాక నియోజకవర్గాల రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య అధ్యక్షత వహించగా, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జె. రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె. బ్రహ్మచారి, అన్నవరపు సత్యనారాయణ, కారం పుల్లయ్య, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్‌తో పాటు దొడ్డా రవికుమార్, నబి, పిట్టల అర్జున్, గద్దం స్వామి, గద్దల శ్రీను, నిమ్మల వెంకన్న, ముదిగొండ రాంబాబు, వీర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.



## కొత్తగూడెం నియోజకవర్గం

కొత్తగూడెం కార్పొరేషన్ - చుంచుపల్లి - లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్




# హ్యూమన్ రైట్స్ స్టేట్ ప్రెసిడెంట్‌కు ఘన సన్మానం

**చంద్రుగొండ, అక్టోబర్ 17(మనం న్యూస్) :** ప్రపంచ చేతులు శుభ్రం దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు స్టేట్ పెన్షనర్స్ హాల్ నందు హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఉత్తమ స్వచ్ఛంద సేవ కులకు అవార్డులు ప్రధానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డి. జి. పి.) ఆఫీస్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ అశోక్ బాబు మరియు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది శైలజ మరియు హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ బొడ్డపాటి దాసు చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారంతో సత్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ కే ఇందిరా ప్రియదర్శిని నేషనల్ సెక్రటరీ జె నిలత ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రెసిడెంట్ కె భాస్కర్ తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ కాల్వ సుధాకర్ రావు భద్రాద్రి కొత్తగూడెం డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ రాందాస్ నాయక్ భద్రాద్రి జిల్లా అడ్వైసరీ కమిటీ అధ్యక్షులు షేక్ అబ్బాస్ భద్రాద్రి జిల్లా కన్వీనర్ మాతంగి రాధ భద్రాద్రి జిల్లా ఇంచార్జ్ సామ్యూల్ భద్రాద్రి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె. దుర్గా భవాని జిల్లా జాయింట్ సెక్రటరీ శోభారాణి జిల్లా కో ఆర్డినేటర్ షేక్ షరీఫ్ చుంచుపల్లి మండల ప్రెసిడెంట్ షేక్ షబ్బీర్ జిల్లా కమిటీ సభ్యులు విజయలక్ష్మి సంధ్య యాదగిరి మొహమ్మద్ షరీఫ్ పాల్గొనడం జరిగినది.

# సింగరేణి క్వార్టర్ల కోసం కౌన్సిలింగ్

**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 16(మనం న్యూస్):** సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలో పనిచేసే ఎన్‌సిడబ్ల్యూఏ ఉద్యోగుల కొరకు బర్మాక్యాంప్ నందు నూతనంగా నిర్మించిన ఎంసి ఎండి టైప్ క్వార్టర్లను ఉద్యోగులకు కేటాయించేందుకు శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు కౌన్సిలింగ్ ను నిర్వహించడం జరిగింది. ఈ క్వార్టర్స్ కౌన్సిలింగ్ లో మొత్తం 92 క్వార్టర్లకు గాను 299 మంది ఉద్యోగులు దరఖాస్తులు చేసుకొగా వారి యొక్క అర్హత కేటగిరి పదవిని బట్టి పూర్తి పారదర్శకతతో వారికి క్వార్టర్స్ కౌన్సిలింగ్ ను నిర్వహించి కేటాయించటం జరిగింది. ఈ కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్) బి.శివ కేశవరావు, డివైపిఎం కే.సునీల్ కుమార్, డివైఎఫ్ఎం సంధ్యా రాణి, సాయి కిరణ్, జూనియర్ అసిస్టెంట్ ఎం.మౌనిక, ఆఫీస్ సిబ్బంది సెక్యూరిటీ సిబ్బంది క్వార్టర్స్ కౌన్సిలింగ్ కు హాజరైన ఉద్యోగులు పాల్గొన్నారు.





మనం



# పాల్వంచ

పాల్వంచ సిటీ - పాల్వంచ మండలం

## చంద్రుగొండ మాజీ జెడ్పీటీసీ సభ్యులు కృష్ణారెడ్డి మాతృమూర్తి మృతి

### – దశదినకర్మల్లో పాల్గొన్న కొత్వాల



**పాల్వంచ, అక్టోబర్ 16 (మనం న్యూస్):** చంద్రుగొండ మాజీ జెడ్పీటీసీ సభ్యులు, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి మాతృమూర్తి అంకిరెడ్డి చిట్టెమ్మ ఇటీవల మరణించారు. చంద్రుగొండ లోని ఆమె స్వగృహంలో దశదినకర్మల సందర్భంగా డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని, ఘనంగా నివాళు లర్పించారు. మాజీ జెడ్పీటీసీ అంకిరెడ్డి కృష్ణారెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రుగొండ మాజీ జెడ్పీటీసీ కొనగండ్ల వెంకటరెడ్డి, కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వరరావు, బోజ్యా నాయక్, కేశబోయిన నరసింహారావు, సోమిరెడ్డి, బూసి శ్రీను, యాటా నాని తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం భగవంతునికి మహా ప్రీతిపాత్రం

### – వెంగళరావు కాలనీలో అన్నదానం



**పాల్వంచ, అక్టోబర్ 16(మనం న్యూస్):** అన్నదానం భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రమైందని ప్రముఖ ఉపాధ్యాయులు వాంకుడోత్ బిందు అన్నారు. శుక్రవారం పట్టణ పరిధి వెంగళరావు కాలనీలో వాంకుడోత్ పున్నమ్మ, చిన్నారి ధాన్విక నిహాన్సి నేత్రత్వంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాలానీలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 6వ రోజు మహిళలు ఆడి, పాడి నృత్యాలు చేశారు. బతుకమ్మ పాటలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పెండ్యాల నాగేశ్వరరావు, చింత రంగారావు, రవి కిరణ్, నూరా మోహన్, స్థానికులు పాల్గొన్నారు.

## మాయమైన మెడికుంట చెరువు..!

### – అధికారుల వద్ద చెరువు రికార్డులు..
### – అయినా కొత్త కమిషన్ ఏర్పాటు చేసినట్లు సమాచారం
### – అసలు చెరువే లేదంటూ హైకోర్టులో పిటిషన్

**పాల్వంచ, అక్టోబర్ 16(మనం న్యూస్):** పట్టణ పరిధి శ్రీనగర్ కాలనీని ఆనుకుని ఉన్న మేడికుంట చెరువు వ్యవహారం హైకోర్టుకు చేరినట్లు తెలుస్తోంది. అసలు చెరువే లేదంటూ కొందరు పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం. మరోవైపు, చెరువుకు సంబంధించిన అధికారిక పత్రాలను ఇరిగేషన్ అధికారులు హైకోర్టుకు సమర్పించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ కొత్త కమిషన్ ఏర్పాటు చేసినట్లు సమాచారం రావడంతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అసలు చెరువు ఉనికినే ప్రశ్నిస్తూ.. పిటిషన్ దాఖలైతే, అధికారిక రికార్డులు ఏం చెబుతున్నాయి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రెండెకరాలకు పైగా విస్తీర్ణం ఉన్నట్టు స్థానికులు చెబుతున్న మేడికుంట చెరువు, నకళ్లవాగుతో ఉన్న సంబంధంపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. పాల్వంచ అభివృద్ధిపై మాట్లాడే నాయకులు ఈ చెరువు వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

## ఆర్‌టీఐ దరఖాస్తుల పరిష్కారంలో..

# జాప్యం చేస్తే చర్యలు

### – ఆరోగ్య శాఖ సిబ్బందికి డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్ ఆదేశాలు



**పాల్వంచ, అక్టోబర్ 16(మనం న్యూస్):** ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారం రాథోడ్ హెచ్చరించారు. శుక్రవారం పాల్వంచలోని ఐడీఓసీ భవనంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన వివిధ ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ఆరోగ్య సంస్థల్లో పనిచేస్తున్న సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. సమాచార హక్కు చట్టం కింద అందిన దరఖాస్తులను సాధారణంగా 30 రోజుల నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరిగినా, చట్ట నిబంధనలను ఉల్లంఘించినా సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు**

ప్రతి ఉద్యోగికి సంబంధించిన వ్యక్తిగత సర్వీసు ఫైళ్లను ప్రత్యేకంగా నిర్వహిస్తూ నియామక ఉత్తర్వులు, బదిలీలు, సెలవులు, ఇతర సర్వీసు వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించి భద్రపరచాలని సూచించారు. పాతవి, కాలం చెల్లినవి, పనికిరాని వైద్య పరికరాలను తొలగించే ముందు సంబంధిత కమిటీకి వివరాలు సమర్పించి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అనుమతితో నిబంధనల ప్రకారం వేలం వేయాలన్నారు. ఇందుకు సంబంధించిన అనుమతులు, వేలం పత్రాలు, ఇతర రికార్డులను భద్రపరచాలని ఆదేశించారు. ప్రతి ఆరోగ్య సంస్థలో సందర్శకుల రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని, సందర్శకుల పేర్లు, హోదాలు, వచ్చిన తేదీ, సమయం, సందర్శన ఉద్దేశాన్ని నమోదు చేయాలని పేర్కొన్నారు. సెలవు రోజులు, ఇతర ప్రత్యేక దినాల్లో విధులు నిర్వహించే సిబ్బంది పేర్లు, హోదాలతో డ్యూటీ రోస్టర్‌ను సిద్ధం చేసి తనిఖీ అధికారులకు అందుబాటులో ఉంచాలన్నారు.

**హాజరు, నివేదికలపై ప్రత్యేక దృష్టి**

అన్ని సంస్థల్లో బయోమెట్రిక్ హాజరు నమోదును క్రమం తప్పకుండా పర్యవేక్షించి, హాజరు నిబంధనలు పూర్తిస్థాయిలో అమలయ్యేలా చూడాలని సూచించారు. హాజరులో ఏవైనా వ్యత్యాసాలు లేదా అవకతవకలు గుర్తిస్తే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. హెడ్ ఆఫ్ అకౌంట్ 2210, 2211 కింద మంజూరైన పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది, ఖాళీల వివరాలను నవీకరించి, సమీక్షా సమావేశానికి సంబంధించిన ఆదేశాలు జారీ చేసిన తేదీ నుంచి వారం రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. త్రైమాసికానికి సంబంధించిన వినియోగ ధ్రువీకరణ పత్రాలు, వ్యయ నివేదికలను నిర్ణీత గడువులోగా అందించాలని స్పష్టం చేశారు. ప్రతి నెల ఐదో తేదీలోగా ఆరోగ్య నిర్వహణ సమాచార వ్యవస్థ (హెచ్ఎంఐఎస్) నివేదికల నమోదు, ధ్రువీకరణ పూర్తి చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ఆరోగ్య పర్యవేక్షకులు, మహిళా ఆరోగ్య పర్యవేక్షకులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఫార్మసీ అధికారులు, స్టాఫ్ నర్సులు సహా సంబంధిత సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలకు అనుగుణంగా ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేసి ధ్రువీకరించాలని సూచించారు. వైద్యాధికారులు, పర్యవేక్షక అధికారులు నివేదికల సమర్పణను నిరంతరం పర్యవేక్షించాలని, నిర్ణీత గడువులోగా అన్ని వివరాలు అందేలా చూడాలని ఆదేశించారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వైద్యాధికారులు, ఇతర సంబంధిత సిబ్బంది ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని, వాటి అమలును ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారని తుకారం రాథోడ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ ఆరోగ్య కేంద్రాల ఆరోగ్య పర్యవేక్షకులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పాల్వంచలో 24న రౌండ్ టేబుల్ సమావేశం : వానపాకుల



**పాల్వంచ, అక్టోబర్ 16(మనం న్యూస్):** ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ ఐక్యవేదిక తరపున పాల్వంచలో ఈనెల 24న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు బహుజన ఐక్యవేదిక నాయకులు వానపాకుల రాంబాబు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బహుజన వర్గాల ప్రజలపై అనేక విధాలుగా వివక్షతలు, దాడులు, అవమానాలు, హత్యలు, మానభంగాలు నిత్యం జరుగుతున్నాయి. ప్రజాస్వామ్య బద్ధంగా పాలక వర్గాలు న్యాయం చేయకపోగా.. అధికార దాహంతో నియంతృత్వ పోకడ కొనసాగుతోంది. రాష్ట్రం, దేశంలో ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చైతన్యంతో ఈ సమస్యలపై చేయి చేయి కలిపి ఎంత పెద్ద సమస్య అయినా ఎదుర్కోవడంతోపాటు మన ఆత్మగౌరాన్ని కాపాడుకోవడానికి సిద్ధపడాలని వానపాకుల రాంబాబు పిలుపునిచ్చారు.

## మన్మోహన్ సింగ్ మైనింగ్ యూనివర్సిటీని

# విశ్వవిద్యాలయాల జాబితాలో ప్రభుత్వం గుర్తించాలి

### – లేనిపక్షంలో అఖిలపక్ష సంఘాలతో నిరసన తెలుపుతాం
### –ఎస్సీ హెచ్ పి ఎస్ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్



**కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 16 (మనం న్యూస్):** షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ కొత్తగూడెం సింగరేణి ఏరియా హాస్పిటల్ సెంటర్ నుండి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్తగూడెం డాక్టర్ మన్మోహన్ సింగ్ మైనింగ్ యూనివర్సిటీని విశ్వవిద్యాలయాల జాబితాలో గుర్తించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఏడు యూనివర్సిటీలను మాత్రమే గుర్తించి కొత్తగూడెం డాక్టర్ మన్మోహన్ సింగ్ మైనింగ్ యూనివర్సిటీని గుర్తించకపోవడం బాధాకరమని అన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి జీవో 31 విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని చూస్తుంటే డాక్టర్ మన్మోహన్ సింగ్ మైనింగ్ యూనివర్సిటీ కి ప్రభుత్వం నుండి ఆదరణ కరువైందని విమర్శించారు. కొత్తగూడెం మన్మోహన్ సింగ్ మైనింగ్ యూనివర్సిటీని విశ్వవిద్యాలయాల జాబితాలో చేర్చకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తే విద్యార్థుల జీవితాలతో చెలగాటం పాడినట్టు అవుతుందని అన్నారు. వారం రోజుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియమకాల్లో కొత్తగూడెం మైనింగ్ యూనివర్సిటీ అధ్యాపకుల భర్తీని గుర్తించి పూర్తి స్థాయిలో ప్రభుత్వాశీ అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో అఖిలపక్ష విద్యార్థి, యువజన, మహిళ సంఘాలతో దశలవారీగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు.

# జిల్లాలో కాయకల్ప అవార్డుల పంట!

**– ఐదు ఆసుపత్రులకు అవార్డులు.. జిల్లా వైద్య ఆరోగ్య రంగానికి అరుదైన గుర్తింపు!**
**– సిబ్బందిలో స్ఫూర్తి నింపిన డీసీహెచ్ఎస్ రవి బాబు.. సహకారం అందించిన జిల్లా కలెక్టర్లు!**



**అశ్వారావుపేట, అక్టోబర్ 16(మనం న్యూస్):** ఒక లక్ష్యం.. ఒక సంకల్పం.. నిరంతర పర్యవేక్షణ.. సిబ్బందికి ప్రోత్సాహం.. వెరసి జిల్లాకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు! భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య రంగంలో కాయకల్ప అవార్డుల రూపంలో విజయాల పంట పండటానికి డీసీహెచ్ఎస్ రవి బాబు గారి కృషి కీలకంగా నిలిచింది. జిల్లాలోని ఐదు ఆసుపత్రులకు కాయకల్ప అవార్డులు దక్కేలా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు సహా ఆసుపత్రి సిబ్బందిని సమన్వయం చేసి, వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపిన ఆయన పనితీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

**సిబ్బందిని ప్రోత్సహించడంలో ప్రత్యేక శైలి! :**
ఆసుపత్రుల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, రోగులకు మెరుగైన సేవలు, వైద్య సదుపాయాల నిర్వహణ వంటి అంశాల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించడం కాయకల్ప అవార్డుల సాధనలో కీలకం. ఈ లక్ష్య సాధన కోసం సిబ్బందిని నిరంతరం ప్రోత్సహించడం, అవసరమైన మార్గదర్శకత్వం అందించడం, ఆసుపత్రుల పనితీరును మెరుగుపరిచేలా సమన్వయం చేయడంలో రవి బాబు ప్రత్యేక చొరవ చూపినట్లు ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఒక ఆసుపత్రికి అవార్డు రావడమే గొప్ప విషయమైతే.. ఒకే జిల్లాలో ఐదు ఆసుపత్రులు అవార్డులు సాధించడం విశేషమైన విజయంగా నిలుస్తోంది. ఈ విజయానికి సిబ్బంది సమష్టి కృషితోపాటు, వారినిఒకే లక్ష్యం వైపు నడిపించిన అధికారుల మార్గదర్శకత్వం తోడవడం అభినందనీయం.

**కలెక్టర్ల సహకారం.. రవి బాబు సమన్వయం!**
జిల్లా వైద్య ఆరోగ్య రంగం అభివృద్ధికి జిల్లా కలెక్టర్లు అందించిన సహకారం, ప్రోత్సాహం కూడా ఈ విజయ ప్రస్థానంలో ముఖ్యమైన పాత్ర పోషించాయి. ఉన్నతాధికారుల మద్దతును సద్వినియోగం చేసుకుంటూ, క్షేత్రస్థాయిలో సిబ్బందితో సమన్వయం సాధించడం ద్వారా ఆసుపత్రుల పనితీరును మెరుగుపరిచేందుకు రవి బాబు కృషి చేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారిగా బాధ్యతలు నిర్వహించడమే కాకుండా, సిబ్బందిలో బాధ్యతాయుతమైన పని సంస్కృతిని పెంపొందించడం, లక్ష్య సాధన దిశగా వారిని నడిపించడం ఆయన పనితీరులో ప్రత్యేకతగా నిలుస్తోంది.



**గిరిజన జిల్లా వైద్య రంగానికి గర్వకారణం!**
గిరిజన ప్రాంతాలు అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఎంతో కీలకం. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులే ప్రధాన ఆధారం. అలాంటి పరిస్థితుల్లో ఆసుపత్రుల ప్రమాణాలు మెరుగుపడటం, పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడటం, సిబ్బందిలో సేవాభావం పెంపొందడం ప్రజారోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ నేపథ్యంలో ఐదు ఆసుపత్రులకు కాయకల్ప అవార్డులు లభించడం జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు గర్వకారణం. ఈ విజయాన్ని సాధించడంలో భాగస్వాములైన వైద్యులు, నర్సులు, పారిశుద్ధ్య సిబ్బంది, ఇతర ఉద్యోగుల కృషి అభినందనీయం. వారందరినీ ప్రోత్సహిస్తూ సమష్టి విజయానికి బాటలు వేసిన డీసీహెచ్ఎస్ రవి బాబు పాత్ర ప్రత్యేకంగా ప్రస్తావించదగినది.

**పదవికి వన్నె తెచ్చే పనితీరు!**
ఒక అధికారి సమర్థత అనేది కేవలం కార్యాలయ నిర్వహణకే పరిమితం కాదు. తన పరిధిలోని సంస్థలు ఎంత మెరుగ్గా పనిచేస్తున్నాయి? ప్రజలకు ఎంత నాణ్యమైన సేవలు అందుతున్నాయి? సిబ్బందిలో ఎంతటి బాధ్యత, అంకితభావం పెరిగాయి? అన్న అంశాలే ఆయన పనితీరుకు నిజమైన కొలమానాలు. ఈ కోణంలో చూస్తే, జిల్లాలోని ఐదు ఆసుపత్రులకు కాయకల్ప అవార్డులు దక్కడం రవి బాబు కృషికి గుర్తింపుగా నిలుస్తోంది. ఉన్నతాధికారుల సహకారం, క్షేత్రస్థాయి సిబ్బంది శ్రమ, సమన్వయంతో కూడిన నాయకత్వం కలిస్తే ఎలాంటి ఫలితాలు సాధించవచ్చో ఈ విజయం చాటిచెబుతోంది. అవార్డులు అందుకోవడమే కాదు.. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడమే అసలైన లక్ష్యం. ఆ దిశగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరిన్ని విజయాలు సాధించాలని, మారుమూల ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్యం మరింత చేరువ కావాలని ఆశిద్దాం. ఐదు ఆసుపత్రులకు కాయకల్ప అవార్డులు.. జిల్లా వైద్య ఆరోగ్య రంగానికి ప్రత్యేక గుర్తింపు.. సిబ్బందిలో స్ఫూర్తి నింపిన నాయకత్వం.. ఇవన్నీ కలిపి డీసీహెచ్ఎస్ రవి బాబు కృషిని మరోసారి చర్చనీయాంశంగా నిలిపారు.

# వేటగాడి ఇంట్లో గంజాయి కలకలం

**– నాటు తుపాకీ కోసం వెతికితే.. మత్తు గుట్టు రట్టు**
**– గంజాయి, భారీగా మందుగుండు సామగ్రి పట్టివేత**
**– కొడిశెలగూడెంలో అటవీశాఖ అధికారుల మెరుపు తనిఖీలు**



**దమ్మపేట,అక్టోబర్ 16(మనం న్యూస్) :** నాటు తుపాకీతో అడవి జంతువులను వేటాడుతున్నాడన్న సమాచారంతో వెళ్లిన అటవీశాఖ అధికారులకు ఊహించని షాక్ తగిలింది. తుపాకీ కోసం ఓ ఇంట్లో జల్లెడ పడితే.. ఏకంగా గంజాయి, మందుగుండు సామగ్రి బయటపడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మండల పరిధిలోని అంకంపాలెం గ్రామపంచాయతీ కొడిశెలగూడెం గ్రామానికి చెందిన పెనుబల్లి నాగులు అనే రైతు నాటు తుపాకీతో అడవుల్లో జంతువుల వేటకు వెళ్తున్నట్లు అటవీశాఖకు పక్కా సమాచారం అందింది. దీంతో ఎఫ్ఎస్ఓ భద్రయ్య సిబ్బందితో కలిసి శుక్రవారం మధ్యాహ్నం సమయంలో నాగులు నివాసంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.నాటు తుపాకీ కోసం గాలింపు చేస్తుండగా, ప్యాక్ చేసి ఉన్న రెండు ప్యాకెట్లు అధికారులకు అనుమానాస్పదంగా కనిపించాయి. వాటి గురించి ఇంట్లో ఉన్న నాగులు భార్యను ఆరా తీయగా ఆమె సరైన సమాధానం చెప్పలేదు. అనుమానం వచ్చిన అధికారులు ఒక ప్యాకెట్‌ను విప్పి పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. వెంటనే అప్రమత్తమై ఇంట్లో క్షుణ్ణంగా శోధించగా మరో ప్యాకెట్ బయటపడింది. లభ్యమైన మొత్తం మూడు ప్యాకెట్లలో సుమారు 5 కిలోల గంజాయి ఉంటుందని సమాచారం.ఈ తనిఖీల్లో నాటు తుపాకీ నేరుగా లభించనప్పటికీ, అందులో ఉపయోగించే భారీ సామగ్రిని అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వేటకు ఉపయోగించే 52 చిన్న చక్రాలు, 28 పెద్ద ఇనుప చక్రాలు, ఒక గన్‌పౌడర్ సీసా, టపాసుల మందు డబ్బా, వేటకు వాడే ప్రత్యేక హారన్, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.ఈ విషయాన్ని ఎఫ్ఎస్ఓ భద్రయ్య ఉన్నతాధికారి అయిన ఎఫ్ఆర్ఓ శ్రీను దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎఫ్ఆర్ఓ స్థానిక ఎస్సై రాజేష్ కుమార్‌కు సమాచారం అందించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, సామగ్రిని అటవీశాఖ కార్యాలయానికి తరలించి అధికారులు పంచనామా నిర్వహిస్తున్నారు.పంచనామా అనంతరం తదుపరి చట్టపరమైన విచారణ నిమిత్తం కేసును స్థానిక పోలీసులకు అప్పగించనున్నట్లు తెలిసింది.





# అశ్వారావుపేట

అశ్వారావుపేట - దమ్మపేట - అన్నపురెడ్డిపల్లి - చండ్రుగొండ - ములకలపల్లి

## వేపకాయల బతుకమ్మ



**అశ్వారావుపేట, అక్టోబర్ 16(మనం న్యూస్) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ మన ఆడపడుచుల జీవితాల్లో ఆనందాలను నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని కౌన్సిలర్ ఉదయ జ్యోతి తెలిపారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలి. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలి. మన అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఐకమత్యంతో బతుకమ్మ సంబరాలను జరుపుకుందాం. అందరికీ వేపకాయల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

## సరస్వతి దేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



**దమ్మపేట, అక్టోబర్ 16:(మనం న్యూస్) :** దమ్మపేట మండల కేంద్రంలోని దార మల్లికార్జున రావు కాంప్లెక్స్ నందు నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆరో రోజు శుక్రవారం అమ్మవారు సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. సరస్వతీదేవి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చినారు. సరస్వతి దేవి అనుగ్రహంతో విద్యార్థులకు విద్యాబుద్ధులు జ్ఞానం వివేకం కలగాలని భక్తులు ప్రార్థించినారు. సరస్వతి దేవి అలంకరణలో తెల్లని రంగు చీర, చేతిలో వీణ, జ్ఞానానికి ప్రతీకగా పుస్తకంతో అమ్మ వారిని కన్నులు విందుగా అలంకరించినారు. బాల బాలికలు సరస్వతీ పూజలు నిర్వహించినారు. మూలా నక్షత్ర సరస్వతి దేవి సన్నిధిలో అక్షరాభ్యాసం చిన్నారులకు చేయించినారు. అనంతరం కమిటీ సభ్యులు చిన్నారులకు పలక బలపాలు పెన్నులు అందజేసినారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులకు ప్రసాద వితరణ నిర్వహించినారు.

## మూకమామిడిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ములకలపల్లి, అక్టోబర్ 16(మనం న్యూస్):** ములకలపల్లిమండలంలోని మూకమామిడి గ్రామ పంచాయతీ లో బతుకమ్మ వేడుకలను పంచాయతీ పరిధిలో సాయిరాంపురం, గుట్టగూడెం,పాత మూక మామిడి, మొగరలప్ప గ్రామాల మహిళలు ఘనంగా నిర్వ హించారు.ఈ వేడుకల్లో గ్రామ పంచాయతీ సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మీ పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ పాటలు పాడి,నృత్యాలు చేసి సందడి చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మీ మాట్లాడుతూ..తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలన్నారు.బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు,సోదరభావానికి నిదర్శనమని,ప్రకృతిని పూజించే గొప్ప పండుగ అని తెలి పారు.ఆడపడుచులంతా సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని గౌరమ్మను కోరుకుంటున్నట్లు తెలిపారు.గ్రామంలోని మహిళలంతా కలిసికట్టుగా ఇలాంటి పండుగలను జరుపుకోవడం అభినందనీయమని,తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ వేడుకల్లో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుక మ్మలతో కోలాటం వేసి సందడి చేశారు.ఈ కార్యక్రమం లో వార్డు సభ్యురాలు సున్నం భద్రమ్మ కుమారి,రమాదేవి,వరలక్ష్మి,భవాని,కమల,సున్నం ధమావతి,ఊకె చిట్టెమ్మ, పాల్గొన్నారు.

మనం
మనం కోసం అక్షర యజ్ఞం..



# భద్రాచలం

భద్రాచలం - దుమ్ముగూడెం

## చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**భద్రాచలం, అక్టోబర్ 16( మనం న్యూస్ ):** భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ఏడుగురు లబ్ధిదారులకు, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గారు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో తోడ్పాటునందిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో ఘనంగా వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ పర్యటన

### - పాఠశాలలో శ్రీ జ్ఞాన సరస్వతి దేవి విగ్రహావిష్కరణ



**భద్రాచలం, అక్టోబర్ 16( మనం న్యూస్):** అంతర్జాతీయ వాసవి క్లబ్ జిల్లా 106-ఏ రీజియన్ పరిధిలోని వాసవి క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ పర్యటన కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. వాసవి క్లబ్ అధ్యక్షులు వనమా కిరణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు వనమా కిరణ్ కుమార్ - జ్యోతి దంపతుల కుమార్తె చిరంజీవి ఆధ్యశ్రీ జన్మదినాన్ని పురస్కరించుకొని, భద్రాచలంలోని ప్రాంతీయ విద్యాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన 'శ్రీ జ్ఞాన సరస్వతి దేవి' విగ్రహాన్ని ముఖ్యఅతిథి చారుగుళ్ల శ్రీనివాస్ చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం జిల్లా గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వాసవి క్లబ్ సమాజ హితం కోసం నిరంతరం అనేక సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతోందని తెలిపారు. భద్రాచలం వాసవి క్లబ్ అధ్యక్షులు వనమా కిరణ్ కుమార్ స్థానికంగా అందిస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన ప్రత్యేకంగా కొనియాడుతూ ప్రశంసించారు. పాఠశాల ఆవరణలో చదువుల తల్లి సరస్వతి దేవి విగ్రహాన్ని నెలకొల్పడం ఎంతో అభినందనీయమని, ఇది విద్యార్థుల్లో చదువుతో పాటు ఆధ్యాత్మిక చింతన, సద్భావన పెంపొందేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ ప్రధాన కార్యదర్శి (అడ్మినిస్ట్రేషన్) చింతల వినోద్ కుమార్, రీజియన్ చైర్మన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వాసవి క్లబ్ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో సత్తా చాటిన తెలంగాణ అథ్లెట్....

### - ప్రపంచ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో డివి శంకర్ రావుకు కాంస్య పతకం

**భద్రాచలం, అక్టోబర్ 16 (మనం న్యూస్):** వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమే అని, దృఢమైన పట్టుదల ఉంటే ఏ వయసులోనైనా అసాధారణ విజయాలు సాధించవచ్చని, తెలంగాణ రాష్ట్రానికి చెందిన 74 ఏళ్ల సీనియర్ అథ్లెట్ డివి శంకర్ రావు నిరూపించారు. గుండెకు బైపాస్ సర్జరీ జరిగినా కూడా వెనకడుగు వేయకుండా, సంకల్ప బలంతో జాతీయ స్థాయిలో రాణించిన ఆయన తాజాగా అమెరికా వేదికగా జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ నెల 15 నుంచి 24 వరకు అమెరికాలో నిర్వహించిన ప్రతిష్టాత్మక 'వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్' పోటీలలో శంకర్ రావు పాల్గొని ఈ ఘనత సాధించారు. వృద్ధాప్యంలోనూ ఎదురైన శారీరక, ఆరోగ్య సవాళ్లను అధిగమిస్తూ ఆయన సాధించిన ఈ విజయం పట్ల భద్రాచలం ప్రాంతంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. భద్రాచలానికి చెందిన ప్రముఖ సిటీ స్టైల్ జిమ్ సెంటర్‌లో కోచ్ జి.వి. రామిరెడ్డి పర్యవేక్షణలో శంకర్ రావు ఈ పోటీల కోసం కఠినమైన శిక్షణ పొందారు. కోచ్ అందించిన సరైన మార్గదర్శకత్వం, శంకర్ రావు అంకితభావం




కలగలిసి దేశానికే గర్వకారణమైన ఈ పతకాన్ని సాధించిపెట్టాయి. అంతర్జాతీయ స్థాయిలో దేశ, రాష్ట్ర ఖ్యాతిని చాటి కాంస్య పతకం గెలుచుకున్న డివి శంకర్ రావుతో పాటు ఆయనకు శిక్షణ అందించిన కోచ్ జి.వి. రామిరెడ్డిని పలువురు రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు, రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ జనరల్ సెక్రటరీ జోసెఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సురేష్, భద్రాద్రి జిల్లా బేసిక్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, పాతాల దుర్గా ప్రసాద్, క్లీన్ భద్రాద్రి సభ్యులు, ప్రెస్ క్లబ్ సభ్యులు, రోటరీ సభ్యులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు మరియు భద్రాచలం ప్రాంతవాసులు ఘనంగా అభినందించారు.

## విపత్తుల నిర్వహణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

### - ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి తేజవత్ వెంకటేష్

**భద్రాచలం, అక్టోబర్ 16( మనం న్యూస్ ):** మారుతి నర్సింగ్ కాలేజ్‌లో మై భారత్ ఆధ్వర్యంలో సదస్సు, ర్యాలీ విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాల ప్రదానం. ప్రకృతి, మానవ నిర్మిత విపత్తులు సంభవించినప్పుడు సరైన అవగాహన, తక్షణ స్పందనతో మాత్రమే ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చని స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్ఎఫ్) అధికారి తేజవత్ వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం భద్రాచలం పట్టణంలోని స్థానిక మారుతి నర్సింగ్ కళాశాలలో 'మై భారత్' సంస్థ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ విపత్తు తగ్గింపు రోజు' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మై భారత్ ప్రతినిధి ములిశెట్టి నిఖిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా తేజవత్ వెంకటేష్ మాట్లాడుతూ వరదలు, అగ్నిప్రమాదాలు, భూకంపాలు వంటి అత్యవసర సమయాల్లో భయపడకుండా ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా సమాజ రక్షణలో సేవలందించే నర్సింగ్ విద్యార్థులు, యువత విపత్తుల నిర్వహణ, ప్రథమ చికిత్స మెలకువలపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ఎంతో




అవసరమని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న బాధితులను ఆదుకోవడంలో మానవతా దృక్పథంతో ముందుండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పట్టణంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మారుతి నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, ప్రముఖులు ఆవుల సుబ్బారావు, ములిశెట్టి రామ్మోహన్ రావు, అన్నం హరీష్, వి. అరుణ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

## కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

**దుమ్ముగూడెం అక్టోబర్ 16 (మనం న్యూస్ ):** దుమ్ముగూడెం మండల ఆదివాసి సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో ములకపాడు కొమరం భీమ్ జంక్షన్ లో ఏర్పాటు చేస్తున్న ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీం విగ్రహ ఆవిష్కరణ పనులను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అశ్వరావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లతో కలిసి శుక్రవారం సందర్శించి పరిశీలించారు. సందర్భంగా కొమరం భీమ్ విగ్రహం ఏర్పాటుకు నడుం బిగించి అహర్నిశలు కృషి చేస్తున్న ఆదివాసి సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక నాయకులను అభినందించారు. ఈ సందర్భంగా పలు సూచనలు సలహాలు చేశారు. కొమరం భీమ్ విగ్రహం పక్కనే నూతనంగా నిర్మిస్తున్న కొమరం భీమ్ బస్ షెల్టర్ పనులను తిలకించిన వారు బస్సు



షెల్టర్ నిర్మాణం చేపట్టాలన్న ఆలోచన చాలా మంచిదని మారుమూల ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ప్రయాణికులకు ఈ బస్సు షెల్టర్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. పక్కనే ఉన్న రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం వద్ద మరమ్మత్తులకు గురైన కొన్ని పనులను చేపట్టాలని సూచన చేశారు. ఈకార్యక్రమంలో ఐక్య కార్యాచరణ వేదిక గౌరవ అధ్యక్షులు కొమురం దామోదర రావు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కకు ఆహ్వాన పత్రిక అందజేసిన ఐక్య కార్యాచరణ వేదిక నాయకులు.

**దుమ్ముగూడెం అక్టోబర్ 16 (మనం న్యూస్):** దుమ్ముగూడెం మండలం ములకపాడు కొమరం భీమ్ వై జంక్షన్ లో దుమ్ముగూడెం మండల ఆదివాసి సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆదివాసీల ఆరాధ్యుడు పోరాటయోధుడు కొమురం భీం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం అక్టోబర్ 22వ తేదీన జరుగుతున్నందున ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని శుక్రవారం ములుగు జిల్లా తద్వాయి గ్రామంలో తెలంగాణ పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ( సీతక్క)



ను దుమ్ముగూడెం మండల ఆదివాసి సంఘాల ఐక్య కార్యచరణ వేదిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. మంత్రి రాకకై మండలంలోని ఆదివాసి మహిళాలు, ఆదివాసి సంఘాల నాయకులు ఎదురుచూస్తున్నారని మంత్రి కి వివరించారు. ఆహ్వాన పత్రిక అందుకున్న మంత్రి సీతక్క సానుకూలంగా స్పందిస్తూ కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణకు వస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ కుంజా శ్రీనివాసరావు, సర్పంచ్ లు పొడియం సుబ్బారావు, కుర్సం రవి, మాజీ ఎంపీటీసీ సోడే తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకలలో సందడి చేసిన ఎమ్మెల్యే తెల్లం

**- మహిళలతో కలిసి ఆడిపాడిన ఎమ్మెల్యే**

**- తాంబూలం సమర్పణలో భాగంగా చీరల పంపిణీ**







**చర్ల, అక్టోబర్ 16(మనం న్యూస్) :** చర్లలోని శాంతిభవనం వద్ద వానపల్లి జయ ఆద్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని సందడి చేసారు.గురువారం రాత్రి ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ముందుగా మహిళలు పేర్చిన బతుకమ్మలకు పూజలు చేసినఅనంతరం మహిళలతో కలిసి ఎమ్మెల్యే బతుకమ్మ పాటలు పాడుతూ ఆడిపాడారు. ఈ సందర్భంగా చింతా నాగేంద్రబాబు అద్యక్షతన జరిగిన సభలో ఎం ఎల్ ఏ మాట్లాడుతూబతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అని, మహిళలంతా కలిసి జరుపుకునే ఈ పండుగ ఎంతో గొప్పదని పేర్కొన్నారు. వెయ్యేల్లనాడు చోళుల కాలంలో ప్రజలు అనారోగ్యం పాలవగా అప్పటి రాజులు బతుకు



కొరకు పూజలు చేయడంతో నాటి నుండి బతుకమ్మకు పూజలు చేయడం సాంప్రదాయంగా మారిందని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు మహిళలంతా ఐఖ్య మత్యంతో బతుకమ్మ వేడులతో సుఖ సంతోషాల నడుమ గడుపడం ఈ పండుగ ప్రత్యేకత అని అన్నారు. గతంలో రాజులు ప్రజల సంక్షేమం కొరకు పనిచేసేవారని, నేడు ముఖ్యమంత్రి, ప్రజా ప్రతినిదులు కూడా సంక్షేమం కొరకు పాటుపడుతున్న విషయాన్ని గుర్తుచేసారు. ఇందులో బాగంగానే రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని వెల్లడించారు.అనంతరం తాంబూలం సమర్పణ కార్యక్రమంలో బాగంగా భద్రాచలంకు చెందిన వస్త్ర వ్యాపారి ముగ్గుల రవీందర్, చర్లకు చెందిన చింతా నాగేంద్రబాబు లు అందచేసిన రెండు వందల చీరలను మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఐ రాజువర్మ, ఎంపిడివో కనపర్తి ఈదయ్య, ఎస్ ఐ నర్సిరెడ్డి, సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, డిసిసి ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

# రెడ్డి సామాజిక వర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తా : కంద్రపు

**- రెడ్డి జాగృతి నూతన అద్యక్షుని ఎన్నిక**





**చర్ల అక్టోబర్ 16 (మనం న్యూస్) :** రెడ్డి సామాజిక అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తానని రెడ్డి జాగృతి చర్ల మండల నూతన అధ్యక్షుడిగా నియమితులయిన కంద్రపు వెంకట్ రెడ్డి, యూత్ అధ్యక్షుడిగా ఎన్నికయిన బోరా పెద్ది రెడ్డి అన్నారు. శుక్రవారం వారిరువురి నియామకం జరిగింది. ఈ నియామకాలతో చర్ల మండలంలో రెడ్డి జాగృతి సంస్థను మరింత బలోపేతం చేస్తూ, సామాజిక వర్గ ఐక్యతకు కృషి చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా నియమితులైన కంద్రపు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెడ్డి జాగృతి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రెడ్డి సామాజిక వర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని, తెలిపారు. వర్గ ఐక్యతను కాపాడుతూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. సమాజంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. యూత్ అధ్యక్షులు బోరా పెద్ది రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా యువతకు ప్రాధాన్య తనిస్తూ, వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొంది ంచేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. యువతను ఐక్యంగా ముందుకు నడిపిస్తూ, సమాజ సేవ పట్ల బాధ్యత కలిగిన, మంచి ఆలోచనలు మరియు నాయకత్వ లక్షణాలు ఉన్న యువకులను తయారు చేయడమే తన లక్ష్యమని అన్నారు. యువతలో చైతన్యం తీసుకువస్తూ, రెడ్డి జాగృతి సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తానని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పెద్దల సలహాలు, సూచనలతో పాటు యువత సహకారంతో సంస్థను మండలంలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని బోరా పెద్ది రెడ్డి స్పష్టం చేశారు.

# మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి : ఏఎంవో రవి

**చర్ల, అక్టోబర్ 16 (మనం న్యూస్) :**



మలేరియాపై సిబ్బంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎంవో రని అన్నారు. శుక్రవారం చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రవి సందర్శించారు రికార్డులు, రిజిస్టర్లు ల్యాబ్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం ఫీల్డ్ స్టాఫ్ తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు కీటకాల ద్వారా వచ్చే వ్యాధుల నివారణలో ప్రముఖ పాత్ర వహించాలని, ప్రతి శు క్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రై డే గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలియజేశారు.మిరప కోత కోసం ఛత్తీస్‌గఢ్ నుండి వలస కూలీలు వస్తున్నందున, వేరే రాష్ట్రం నుండి వచ్చిన వారి వివరాలు సేకరించి ఫాలో-అప్ చేయాలని సూచించారు. ప్రతి జ్వర కేసును తప్పనిసరిగా ఫాలో-అప్ చేయాలని అన్నారు. ముఖ్యంగా మలేరియా ప్రభావిత ప్రాంతాలైన గోత్తికోయ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, అక్కడ ఎక్కువగా హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలోహెల్త్ సూపర్వైజర్ రామ్ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ గోపి, హెల్త్ అసిస్టెంట్లు నరసింహారావు, ధర్మారావు, ఆరోగ్య సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మనం



# చర్ల

**చర్ల మేజర్ పంచాయతీ - చర్ల మండలం**

# ఈజీఎస్ పనులను పరిశీలించిన ఏపిడి





**చర్ల, అక్టోబర్ 16 (మనం న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డి ఆర్ డి ఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ భాస్కర్ రెడ్డి, జిల్లా సాంకేతిక సలహాదారు రాజు శుక్రవారం కుర్నపల్లి గ్రామపంచాయతీలో జరుగుతున్న ఫారం పాండ్ పనులను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం, నీటి అవస్యకత, వి బి జి రామ్ జి పథకంలో ఉన్నటువంటి 375 పనులను పరిశీలన చేసి గ్రామ పంచాయతీ వారిగా ప్రజల భాగస్వామ్యంతో పనులు గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుపతి రావు, ఉపాధి హామీ ఏపీవో సాంబశివరావు, ఎంపీవో మూర్తి, పంచాయతీ కార్యదర్శి నరసింహ రావు, క్షేత్ర సహాయకుడు గోపాల్ గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం చర్లలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఈదయ్య ఆద్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, విబిజి రామ్ జి సిబ్బందితో సమీక్ష అ సమావేశం నిర్వహించారు.

# భద్రాచలంలో 86 ఏళ్ల వృద్ధుడు అదృశ్యం...

**- ఆచూకీ కోసం పోలీసుల విజ్ఞప్తి**



**భద్రాచలం, అక్టోబర్ 16 (మనం న్యూస్):** భద్రాచలం పట్టణంలో 86 ఏళ్ల వృద్ధుడు అదృశ్యమైనట్లు టౌన్ సీఐ ఎస్. రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.?పట్టణంలోని ఆర్యవైశ్య సత్రం ఎదురుగా నివాసముంటున్న యాసరపు లక్ష్మణ్ (86) ఈ నెల 13వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, పరిచయస్తుల వద్ద, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆయన ఆచూకీ లభించకపోవడంతో లక్ష్మణ్ కుమారుడు శ్రీనివాసరావు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.లక్ష్మణ్ మానసిక స్థితి సరిగా లేదని కుటుంబ సభ్యులు తెలిపారని సీఐ పేర్కొన్నారు. అదృశ్యమైన సమయంలో ఆయన తెల్లటి ప్యాంటు, నల్లటి టీషర్టు ధరించి ఉన్నారు. తెలుపు, నలుపు రంగులు కలిసిన ఉంగరాల జుట్టు కలిగి ఉంటారు.?పరిసర గ్రామాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు లేదా ఇతర బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడైనా ఈ వృద్ధుడిని గుర్తించినా, ఆయన ఆచూకీ తెలిసినా వెంటనే భద్రాచలం టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని సీఐ రాజు కోరారు. సమాచారం తెలిసినవారు 8712682160, 8712682105 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని, వృద్ధుడిని సురక్షితంగా కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మనం



# ఇల్లందు

ఇల్లందు మున్సిపాలిటీ - ఇల్లందు మండలం - టేకులపల్లి - కామేపల్లి

## టేకులపల్లి సంతలో పోగొట్టుకున్న మొబైల్ బాధితురాలికి అందజేత

**టేకులపల్లి,అక్టోబర్ 16(మనం న్యూస్):** టేకులపల్లి మండల పరిధిలోని సులానగర్ గ్రామానికి చెందిన కొట్టే జ్యోతి అనే మహిళ సుమారు ఆరు నెలల క్రితం టేకులపల్లి సంతలో తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నారు.ఈ విషయమై ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు టేకులపల్లి ఎస్సై తిరుపతి,పోలీసు




సిబ్బంది సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గాలింపు చర్యలు చేపట్టారు.ట్రేస్ చేసిన మొబైల్ ఫోన్‌ను శుక్రవారం బాధితురాలు కొట్టే జ్యోతికి అందజేయడం జరిగింది.పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ తిరిగి దక్కడంతో బాధితురాలు టేకులపల్లి పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టేకులపల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోవాలి.

**- నవంబర్ 6 ఆఖరు గడువు - టేకులపల్లి తహసిల్దార్ వీరభద్రం**

**టేకులపల్లి,అక్టోబర్ 16(మనం న్యూస్):** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టేకులపల్లి తహశీల్దార్ లంకపల్లి వీరభద్రం పిలుపునిచ్చారు. 2023 సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులతో పాటు,గత ఎమ్మెల్సీ ఓటర్ జాబితాలో పేరున్న వారు సైతం నిబంధనల ప్రకారం తప్పనిసరిగా కొత్తగా ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.ఈ ప్రక్రియలో అర్హులందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.ఓటరు నమోదు కోసం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానాల ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించబడింది. నవంబర్ 6వ తేదీని దరఖాస్తులకు చివరి తేదీగా నిర్ణయించినట్లు తహశీల్దార్ తెలిపారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు దరఖాస్తుతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో,డిగ్రీ సర్టిఫికెట్,ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను జత చేసి సమర్పించాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు తమ అక్నాలెడ్జిమెంట్ కాపీతో పాటు డిగ్రీ సర్టిఫికెట్,ఆధార్ జిరాక్స్ గెజిటెడ్ సంతకాలు చేసిన ప్రతులను తహశీల్దార్ కార్యాలయంలో తప్పనిసరిగా అందజేయాలని సూచించారు.పట్టభద్రులంతా ఈ సూచనలను గమనించి, గడువులోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

**ఖమ్మం, అక్టోబర్ 16(మనం న్యూస్):** ఖమ్మం జడ్పీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ పిడమర్తి రవి అన్న పిలుపుమేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు . ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారును గుర్తించడానికి మరియు వాళ్ల పేర్లు నమోదు



చేసుకోవడానికి వెబ్సైట్ ప్రక్రియను ప్రారంభించినందుకు ఉద్యమకారుల అందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . వెబ్సైట్ ప్రక్రియను వేగవంతం చేసి తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించి 250 గజాల ఇంటి స్థలం , గుర్తింపు కార్డు , ఇంటి నిర్మాణం కోసం 10 లక్షల రూపాయలు , నెలకు 30 వేలు వేతనం ఇచ్చేలా చూడాలని కోరారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు జిల్లా విజయ్ కుమార్ , తెలంగాణ ఉద్యమ జేఏసీ రాష్ట్ర నాయకులు మట్టి గురుమూర్తి , డాక్టర్ కె.వి కృష్ణారావు , కొరకప్ప రామారావు , మహేష్ , అరుణ , సరిత , సవిత , సురేష్ , నరేష్ తదితరులు పాల్గొన్నారు

## ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

**- ప్రత్యేక ఆహ్వానితుడిగా పాల్గొన్న ఎమ్మెల్యే కోరం**

**ఇల్లందు, అక్టోబర్ 16 (మనం న్యూస్) :** ఇల్లందు ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఇల్లందు పట్టణ గ్రామీణ ప్రాంత మహిళా మనులచే బతుకమ్మ సంబరాల కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు ఇల్లందు 24 వార్డులోని కాంగ్రెస్ పార్టీ అభిమానులు మహిళా మణులు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని



పేర్కొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ మహిళలు వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడటం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో బతుకమ్మను పూజించి, చివరి రోజున నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. బతుకమ్మ పాటల్లో మహిళల జీవన విధానం, కష్టసుఖాలు, ప్రేమాభిమానాలు,బంధుత్వాలు, భక్తిభావాలుప్రతిబింబిస్తాయని వివరించారు. తెలంగాణ అస్తిత్వాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగకు రాష్ట్ర ఆవిర్భావం అనంతరం మరింత ప్రాచుర్యం లభించిందన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ పండుగ తెలంగాణ ప్రజల ఐక్యతకు, మహిళల సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర దానియల్ వైస్ చైర్మన్ రాజు వార్డు మెంబర్లు ఇల్లందు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బోళ్ల సూర్యం కో ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి ఇల్లందు కాంగ్రెస్ పార్టీ వివిధ స్థాయి శ్రేణులు పార్టీ అభిమానులు మహిళా మణులుతదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

**ఇల్లందు, అక్టోబర్ 16 (మనం న్యూస్) :** తెలంగాణసంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఇల్లందుఏరియాలోని స్థానిక సింగరేణి పాఠశాల ఆవరణలో సేవా సమితి సభ్యులు, ఉద్యోగుల కుటుంబాలకు చెందిన మహిళలకు బతుకమ్మ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ వి. కృష్ణయ్య



ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి సేవా అధ్యక్షురాలు వి. రమ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ,సందర్భంగా సేవా అధ్యక్షురాలు వి. రమ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ప్రకృతిలో లభించే రంగురంగుల పూలను అందంగా పేర్చి బతుకమ్మలను రూపొందించడం ఈ పండుగ ప్రత్యేకత అని పేర్కొన్నారు. మహిళలు బతుకమ్మల చుట్టూ వలయాకారంలో తిరుగుతూ చప్పట్లు కొడుతూ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడటం



తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. బొడ్డెమ్మతో ప్రారంభమై ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులపాటు కొనసాగే ఈ పండుగ ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయమని వివరించారు. బతుకమ్మ పాటలు తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని, ఆచార వ్యవహారాలను, సంస్కృతిని ప్రతిబింబిస్తాయని తెలిపారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ పండుగ తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తోందని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా మహిళల్లో ఐక్యత, సాంస్కృతిక చైతన్యం పెంపొందుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతగా సేవా సెక్రటరీ సులక్షణ, సేవా సమితి సభ్యులు, ట్రైనర్స్ , పాఠశాల ఉపాధ్యాయులు, ఉద్యోగుల కుటుంబాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మేరమ్మ యాడి జగదాంబ దేవి దసరా ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అంకిత్

**టేకులపల్లి,అక్టోబర్ 16(మనం న్యూస్):** టేకులపల్లి మండల కేంద్రంలోని సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయం నందు ఈ నెల 18,19,20 తేదీలలో జరుగనున్న మేరమయ్యాడి జగదాంబ దేవి దసరా ఉత్సవాల గోడపత్రికను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు కలెక్టర్ కి ఆదివారం జరుగనున్న దసరా ఉత్సవాలకు అధికారికంగా ఆహ్వానం అందజేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన ఈ దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమనిఉత్సవాలను విజయవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం తరవున సంపూర్ణ సహకారం



అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గుగులోత్ మోతీలాల్,బానోత్ మంగీలాల్ నాయక్,భూక్యా హీరాలాల్ నాయక్,ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మణుగూరు

మణుగూరు మున్సిపాలిటీ - మణుగూరు మండలం - అశ్వాపురం - బూర్గంపాడు

# గ్రామీణ విద్యుత్ వ్యవస్థకు కొత్త బలం

## - ముసలిమడుగులో రూ.2.50 కోట్లతో విద్యుత్ ఉపకేంద్రం

**- భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.. రైతులకు, ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరాకు అవకాశం**





**బూర్గంపహాడ్ , అక్టోబరు 16 ( మనం న్యూస్ ):** గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచి, రైతులు, ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చే దిశగా మరో ముందడుగు పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ముసలిమడుగులో రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పనులకు పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు గురువారం భూమిపూజ చేశారు. ఈ ఉపకేంద్రం అందుబాటులోకి వస్తే ముసలిమడుగుతో పాటు పరిసర గ్రామాల విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

**పెరగనున్న విద్యుత్ సరఫరా సామర్థ్యం**

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా ఎంతో కీలకం. విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో ముసలిమడుగులో నూతన విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉపకేంద్రం నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే స్థానికంగా విద్యుత్ సరఫరా మెరుగుపడటంతో పాటు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి దోహదపడనుంది. ముఖ్యంగా వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సరఫరా మరింత పటిష్టమయ్యే అవకాశం ఉంది.

**గ్రామీణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, గ్రామీణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ప్రజలకు అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి రావడం ముఖ్యమన్నారు. మారుమూల గ్రామాల్లోనూ విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజలకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**నియోజకవర్గ అభివృద్ధికి కృషి**

పినపాక నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. రైతులకు, గ్రామీణ ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడంతో పాటు, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ముసలిమడుగులో చేపట్టనున్న రూ.2.50 కోట్ల విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం స్థానిక విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కీలకంగా నిలవనుంది. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గాంధీనగర్‌లో సైడ్ కాలువల నిర్మాణానికి ఎదురుచూపులు

## - మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.. అధికారులకు స్థానికుల విజ్ఞప్తి



**బూర్గం పహాడ్ అక్టోబర్ 16 (మనం న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని గాంధీనగర్ కాలనీలో సైడ్ కాలువల నిర్మాణంపై స్థానికులు ఆశలు పెట్టుకున్నారు. కాలనీలోని పలు వీధుల్లో కాలువలు లేకపోవడంతో మురుగునీరు, వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోతోందని, దీంతో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా సైడ్ కాలువల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. మురుగు నీరు సక్రమంగా వెళ్లే మార్గం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నీరు నిలిచే ప్రాంతాల్లో దోమల బెడద, దుర్వాసన సమస్యలు కూడా తలెత్తుతున్నాయని చెబుతున్నారు.

**అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి**

గాంధీనగర్ కాలనీలో సైడ్ కాలువలు లేని వీధులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య తీవ్రతను బట్టి నిర్మాణ పనులకు ప్రణాళిక రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం చొరవ తీసుకుని అందుబాటులో ఉన్న నిధుల ఆధారంగా దశలవారీగా కాలువల నిర్మాణానికి చర్యలు చేపడితే కాలనీవాసులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడుతున్నారు. కాలనీలో పారిశుధ్యం మెరుగుపడటంతో పాటు మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం సమన్వయంతో ముందుకు సాగాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

# శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదానం

**అశ్వాపురం, అక్టోబర్ 16 ( మనం న్యూస్ ):** శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మొండికుంట రాజీవ్ స్ట్రీట్ లోని భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు భక్తులు మహిళలు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నవరాత్రి ఉత్సవాలలో శుక్రవారం అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలకు భవాని యూత్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపారు.



# మారెళ్ళపాడు ప్రాజెక్టు ద్వారా తుమ్మలచెరువు నింపాలి

**అశ్వాపురం, అక్టోబర్ 16 ( మనం న్యూస్ ):** సీతారామ ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించిన మారెళ్ళ పాడు ప్రాజెక్టుతో తుమ్మల చెరువు నింపాలని సీపీయం మండల కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం రామచంద్రపురంలో రైతుసంఘం మండల అధ్యక్షుడు బద్దం శంభి రెడ్డి అధ్యక్షతన జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ముందుగా వివిధ గ్రామ పంచాయతీలలో అమరులైన సీపీఎం నాయకులకు సంతాపం తెలిపారు. అనంతరం ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు, పోరాట ప్రణాళికలు రచించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రేపాకుల శ్రీనివాసరావు మాట్లాడుతూ, మారెళ్ల పాడు ప్రాజెక్టు ద్వారా తుమ్మల చెరువుకు నీళ్ల నత్త నడకన రావడంతో చెరువు నిండేందుకు అధిక సమయం పడుతుందని, త్వరగా నింపేందుకు రైతాంగాన్ని సమీకరించి పోరాటం చేసి అధికారులపై వత్తిడి తెస్తామన్నారు. రైట్ కెనాల్ పనులు వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు గద్దల శ్రీనివాస్, పాయం నర్సింహారావు, పినికేశి సుధాకర్ రెడ్డి, దండి రాములు, పగడాల అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ఇరవెండిలో సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి సర్వం సిద్ధం

**- భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు.. పుష్కర ఘాట్ వద్ద సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి ప్రత్యేక చొరవ**

**బూర్గంపహాడ్ అక్టోబర్ 16 (మనం న్యూస్):** సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఇరవెండి గ్రామంలోని పుష్కర ఘాట్ వద్ద నిమజ్జన ఏర్పాట్లు పూర్తిచేశారు. పండుగకు వచ్చే మహిళలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక చొరవ తీసుకుని అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

**ఘాట్ వద్ద పారిశుద్ధ్య పనులు.. రాత్రివేళల్లో వెలుగులు**

సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడంపై గ్రామపంచాయతీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా పుష్కర ఘాట్ పరిసరాలను శుభ్రపరిచి, నిమజ్జనానికి అనువుగా ఉండేలా క్లియరెన్స్ పనులు చేపట్టారు. రాత్రివేళల్లో నిమజ్జన కార్యక్రమం నిర్వహించే మహిళలు, భక్తులకు ఇబ్బందులు కలగకుండా లైటింగ్ ఏర్పాట్లు చేశారు.

**సమన్వయంతో ఏర్పాట్ల పూర్తి**

గ్రామంలో బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేలా సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు సైతం సౌకర్యవంతంగా నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనేలా ఘాట్ పరిసరాల్లో అవసరమైన ఏర్పాట్లకు ప్రాధాన్యమిచ్చారు. గ్రామ ప్రజలకు పండుగ సమయంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టిన సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మనం



# పినపాక

మణుగూరు - అశ్వాపురం - పినపాక - కరకగూడెం - ఆళ్లపల్లి - గుండాల- బూర్గంపాడు

## సిపిఐ, ఏఐఎస్ఎఫ్ ఉద్యమాల ద్వారా గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి రెగ్యులర్ డాక్టర్ కేటాయింపు

**- నూతన డాక్టర్ ను ఘనంగా సన్మానించిన సిపిఐ, ఏఐఎస్ఎఫ్ నాయకత్వం**
**సిపిఐ మండల కార్యదర్శి వాగబోయిన రమేష్**



**గుండాల,అక్టోబర్ 16(మనం న్యూస్):** గుండాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెగ్యులర్ డాక్టర్‌ను కేటాయించాలనే ప్రధాన డిమాండ్‌తో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ,అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరహార దీక్ష, నిరసన కార్యక్రమాల ఫలితంగానే ప్రభుత్వం గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి కొత్త రెగ్యులర్ డాక్టర్‌ను కేటాయించిందని సిపిఐ మండల కార్యదర్శి వాగబోయిన రమేష్ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే షాహిద్ పేర్కొన్నారు. గుండాల మండల ప్రజలు వైద్య సేవల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ,ప్రభుత్వ ఆసుపత్రిలో రెగ్యులర్ డాక్టర్ లేకపోవడం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిందని వారు అన్నారు.ఈ సమస్యను ప్రభుత్వం, సంబంధిత వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సిపిఐ,ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళనలు నిర్వహించామని తెలిపారు.ప్రజల ఆరోగ్య హక్కు కోసం చేపట్టిన పోరాటానికి స్పందించి రెగ్యులర్ డాక్టర్‌ను కేటాయించడం హర్షణీయమని,ఈ పరిణామం ప్రజా ఉద్యమాల శక్తిని మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు.ఇది ఏ ఒక్కరి దయాదాక్షిణ్యాల వల్ల వచ్చిన విజయం కాదు. ప్రజల ఐక్యత సిపిఐ ఏఐఎస్ఎఫ్ పోరాటం వల్ల సాధించిన విజయమని స్పష్టం చేశారు.నూతన డాక్టర్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ముఖ్యంగా పేద గిరిజన ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలను సమర్థవంతంగా అందించాలని కోరారు.గుండాల ప్రభుత్వ ఆసుపత్రిని మరింత బలోపేతం చేయడానికి అవసరమైన వైద్య సిబ్బంది, మందులు,వైద్య పరికరాలు తదితర సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.గుండాల మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ,ఏఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తాయని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, బచ్చల రామయ్య, సాహెబ్,లక్ష్మయ్య, హరీష్,వరుణ్, నాసిర్ చందు, భద్రం,రమేష్, చిన్నరాములు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఆదివాసీలకు న్యాయం జరిగేనా ?

**- కోనేరుగూడెం అంగన్‌వాడీ పోస్టుపై సమగ్ర విచారణ చేపట్టాలి**
**- వరుస వార్తా కథనాలు వచ్చినా స్పందించని అధికారులు**
**- తుడుందెబ్బ మండల అధ్యక్షుడు చేబోతు రంజిత్ కుమార్ డిమాండ్**




**గుండాల,అక్టోబర్ 16(మనం న్యూస్):** మండల పరిధిలోని కోనేరుగూడెం అంగన్‌వాడీ పోస్టు నియామకంలో అవకతవకలు జరిగాయంటూ తుడుందెబ్బ మండల అధ్యక్షుడు చేబోతు రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో ఆరోపించారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి,అర్హులైన స్థానిక ఆదివాసీలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనేరుగూడెం అంగన్‌వాడీ పోస్టును స్థానిక ఆదివాసీలకు కేటాయించాల్సి ఉండగా,ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన స్థానికేతర లంబాడీలకు మండల అధికారులు నివాస ధ్రువీకరణ పత్రాలు రెసిడెన్షియల్ సర్టిఫికెట్లు ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు.ఈ సర్టిఫికెట్ల జారీ వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీసేందుకు అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.మండలంలో స్థానికేతరులకు ఉద్యోగ నియామకాల్లో అవకాశం కల్పించడం వల్ల స్థానిక ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత కలిగిన స్థానికులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, అంగన్‌వాడీ పోస్టు నియామక వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ఈ అంశంపై వరుసగా వార్తా కథనాలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారులు స్పందించక పోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించి, అర్హులైన స్థానిక ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## గుండాల మండల అభివృద్ధిపై అధికారులు, ఎమ్మెల్యే దృష్టి సారించాలి

**- మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి - ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించాలి**
**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐఏడబ్ల్యుయు) మండల కార్యదర్శి తోలేం గోపి**



**గుండాల,అక్టోబర్ 16(మనం న్యూస్):** గుండాల మండలంలో ఏళ్లు గడుస్తున్నా గుండాల నుండి రంగాపురం, మణుగూరు వెళ్లే ప్రధాన రహదారి ఇప్పటివరకు బీటీ రోడ్డు పనులు పూర్తికావడం లేదని ముత్తాపురం నుండి పెద్దతోగు, నడిగూడెం నుండి దొంగతోగు, సజ్జలబోడు నుండి వలసల వరకు బిటి రోడ్లు మంజూరు చేయాల్సిన బాధ్యత ఈ జిల్లా మంత్రులపై స్థానిక ఎమ్మెల్యే పై ఉందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఏఐఏడబ్ల్యు యు మండల కార్యదర్శి తోలేం గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులకు ఆర్ ఓ ఎఫ్ ఆర్ అడవి హక్కుల చట్టం ద్వారా అందరికీ పట్టాలిస్తామని చెప్పిన ఇప్పటివరకు పట్టాలు ఇవ్వకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. పీసా చట్టం పకడ్బందీగా అమలు చేయకపోవడం మూలాన అంతా ఖనిజ సంపద జల వనరులు అడవి ఉత్పత్తుల పై ఆదివాసులకు పట్టు తగ్గుతుందని తక్షణమే పిసా చట్టాన్ని పక్కగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ తీసి స్థానిక ఉద్యోగాలు ఆదివాసుల కే ఇవ్వాలని కోరారు. గుండాల ప్రాంతం గిరిజనులు మొత్తం వ్యవసాయం మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని ఈ ప్రాంతంలో నీటి వనరులు పుష్కలంగా ఉన్న ఇప్పటివరకు ప్రభుత్వం గుర్తించి చెరువులు లిఫ్ట్ ఇరిగేషన్ చెక్ డాములు నిర్మించి ఈ ప్రాంత వ్యవసాయానికి నీటి వనరులు అనుసంధానం చేయడంలో విఫలమైందని, మల్లన్న వాగు, కిన్నెరసాని ఏడు మొలకల వాగు, జల్లేరు,బూడిద వాగు,బండి రేవు ఈ ప్రాంతంలో ఉన్నప్పటికీ వీటిని పైన బలమైన చెరువులు నిర్మించడంలో విఫలమైనందుకే ఈ ప్రాంతం వ్యవసాయం దివాలా తీస్తుందని అన్నారు.ప్రభుత్వం అభివృద్ధి పేరుతో పేపర్ ప్రకటనలకు ప్రచారానికి తప్ప ఈ మండలానికి ప్రజలకు చేసింది శూన్యమని అన్నారు.గుండాల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, పంటలు ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వం వైద్యశాలలో బతుకమ్మ సంబరాలు



**ఆళ్ళపల్లి, అక్టోబర్ 16 (మనం న్యూస్):** మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ ప్రారంభమై ఏడవ రోజు సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో వైద్య సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారుచేసి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలను జరుపుకున్నారు.ఈ వేడుకల్లో జిల్లా ఉప వైద్యాధికారి ప్రతాప్, ఆళ్లపల్లి ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి గోపిలాల్, ఆరోగ్య విస్తరణ అధికారి టి. రమాదేవి ముఖ్య అతిథులుగా పాల్గొని బతుకమ్మ వేడుకలను ఆనందోత్సవాల నడుమ జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది నందిని, సునీత, సరిత, పార్వతి, రమేష్ బాబు, రమ కుమారి, అరుణ కుమారి, సుగుణ, రమణ, రేవతి, రోజా, నరేష్, శ్రీధర్ బాబు, నాగేశ్వరరావు, యాకూబీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. వైద్యశాల ప్రాంగణమంతా బతుకమ్మ పాటలతో, కోలాటాలతో సందడిగా మారింది.

## మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన



**అశ్వాపురం, అక్టోబర్ 16( మనం న్యూస్ ):** మండలంలోని మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల1990-91 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల ఆవరణలో జ్ఞానదాత, చదువుల తల్లి సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నూతనంగా ప్రతిష్ఠించిన సరస్వతీ దేవి విగ్రహానికి వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ పాలు, పెరుగు, నెయ్యి, తేనె మరియు పుణ్యజలాలతో శాస్త్రోక్తంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లెల మడుగు సర్పంచ్ మచ్చ నరసింహారావు, మొండికుంట మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి నైనిష ఫౌండేషన్ ఆర్థిక చేయూత

**- బాధితుడికి రూ.3,000 సాయం అందజేత.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తాం**
**- ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సాగర్ యాదవ్**



**మణుగూరు, అక్టోబర్ 16(మనం న్యూస్):** కిడ్నీ వ్యాధితో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పొడిపాక మల్లేష్‌కు నైనిష ఫౌండేషన్ అండగా నిలిచింది. బాధితుడి పరిస్థితిని తెలుసుకున్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మట్టపల్లి సాగర్ యాదవ్ తన వంతు సహాయంగా రూ.3,000 ఆర్థిక సాయం అందజేశారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం, మణుగూరు మండలం బాయి కూనవరం గ్రామానికి చెందిన పొడిపాక మల్లేష్ కిడ్నీ సమస్యతోబాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆర్థిక పరిస్థితి అనుకూలించక వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయన పరిస్థితిని నైనిష ఫౌండేషన్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేద లు, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబా లకు తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు నైనిష ఫౌండేషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ తమ పరిధిలో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో నైనిష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మట్టపల్లి సాగర్ యాదవ్, జర్నలిస్ట్ పొదిల వీరబాబు, న్యాయవాది, న్యాయ సలహాదారు ఈర్ల రాము, బానోత్ రమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సంఘటన్ సృజన్ అభియాన్ ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న నూతి సత్యనారాయణ



**ఖమ్మం, అక్టోబర్ 16(మనం న్యూస్):** హైదరాబాద్ గాంధీభవన్‌లో ఏఐసిసి కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కో ఇంచార్జి సచిన్ సావంత్, సంఘటన్ సృజన్ అభియాన్ చైర్మన్ గంప వేణు గోపాల్ మండల, పట్టణ, గ్రామ, బూత్ కమిటీలపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు. జిల్లా లోని మండల, పట్టణ, గ్రామ, బూత్ కమిటీలపై సవివరంగా వివరించారు. అనంతరం నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాలలో మండల , పట్టణ కమిటీలు పూర్తి చేశామని ఆయా నియోజకవర్గాల శాసనసభ సభ్యులు అందరూ సహకరిస్తున్నారని, అదే విధంగా మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కమిటీల ఏర్పాటు చేశారని తెలిపారు. అతి తొందరలో గ్రామ, డివిజన్, బూత్ కమిటీలు పూర్తి చేస్తామని అన్నారు.

# విజయనగర్ కాలనీలో వేపకాయల బతుకమ్మ వేడుకలు

**ఖమ్మం, అక్టోబర్ 16(మనం న్యూస్):** ఖమ్మం నగరం 56వ డివిజన్ విజయనగర్ కాలనీ శ్రీ షిరిడి సాయి బాబా మందిర ప్రాంగణంలో ఏడో రోజు వేపకాయల బతుకమ్మలను అత్యంత వైభవంగా నిర్వహించారు . మహిళలు సకినాల పిండిని వేపకాయల్లా తయారు చేసి నూనెలో కాల్చి గౌరమ్మకు నైవేద్యంగా పెట్టి బతుకమ్మలను రకరకాల పువ్వులతో ఏడు వరుసల్లో పేర్చుకొని వచ్చి మహిళలందరూ ఒకే రకమైన చీరలు ధరించి ఆటపాటలతో కోలాటాల నృత్యాలు చేయడం చూపరులను ఆకట్టుకున్నాయి . ఈ వేడుకలో పాల్గొన్న మహిళలకు నిర్వాహకులు పసుపు కుంకుమలు అందచేశారు అనంతరం ప్రసాద వితరణ, బతుకమ్మల నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి . ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను విజయవంతం చేశారు .

## దిగులు లేని జీవితం..దిగాలు పడుతున్నవైనం !!

**( దిగులును దాటి... గెలుపు వైపు ! )**

నిన్నటి వరకు నింగిని తాకిన ఉత్సాహం..!
నిరాశ తీరాల్లో ఎందుకు వేస్తోంది ఈ సంశయం..?
దిగులుకు అడ్రస్ లేని నీ చైతన్య రథం..!
దిగాలు పడి ఆగిందా నేడు నీ జీవన పథం..?
వసంతాలు పూసిన తోటలో,
శిశిరం రావడం ప్రకృతి సహజం..!
సంతోషాలు విరిసిన జీవితంలో,
కష్టాలు రావడం కాలకృత్యం..!
అంతమాత్రానికే ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతావా..?
దిగాలు పడి నీ గమ్యాన్ని మార్చు కుంటావా..?
సముద్రపు కెరటం పడిపోవడానికి కాదు,
మళ్లీ అంతకంటే ఎత్తుకు పైకి లేవడానికి..!
నీ కన్నీటి చుక్కలు బలహీనతకు నిదర్శనం కాదు..!
నీలో దాగున్న పట్టుదలను రగిల్చే ఇంధనాలు..!
తోడు ఎవరున్నారని వెతుక్కోకు,
నీ నీడే నీకు తోడై నడుస్తుంది..!
దారి ఎక్కడుందని ఆగిపోకు,
నీ అడుగులే కొత్త బాటను నిర్మిస్తాయి..!
విమర్శల రాళ్లను పునాదులుగా మార్చుకో..!
పరాజయాల గాయాలను పాఠాలుగా మలుచుకో..!
గుండెల్లో ధైర్యం అనే హిమాలయాన్ని నిలబెట్టు..!
కళ్ళల్లో గెలుపు అనే సూర్యుడిని ప్రతిష్టించు..!
చీకటి ఎంత గాఢంగా ఉంటే,
ఉదయం అంత అద్భుతం గా వస్తుందని మరువకు..!
దిగులు ఎంత బలంగా వేధిస్తే,
నీ విజయం అంత ఘనంగా ఉంటుందని నమ్ము..!
దిగాలు పడిన వదనాన్ని పక్కన పెట్టు,
సింహంలా నీ ప్రయాణాన్ని మళ్లీ మొదలుపెట్టు..!
కాలం నీతో నడుస్తుంది,
విజయం నీ పాదా క్రాంతమవుతుంది..!
నీ సంకల్పం ముందు ఏ శక్తీ
నిలువలేక లొంగి పోతుంది !
దిగులు వదిలి ముందుకు..
మున్ముందుకు
సాగిపో నేస్తమా..!!



**– గిరి ప్రసాద్ సోముల..**
**జర్నలిస్ట్, 9490063550**

# ఆడపడుచులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం

**– ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంబరాన్నంటిన వేడుకలు**





**మణుగూరు, అక్టోబర్ 16(మనం న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొని ఆడపడుచులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో సందడి చేశారు.పూలతో కళకళలాడిన క్యాంపు కార్యాలయంవివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రాంగణానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. దీంతో క్యాంపు కార్యాలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మహిళలతో మమేకమై వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాలను భావితరాలకు అందించాలని పేర్కొన్నారు.

**మహిళల ఐక్యతకు ప్రతీక బతుకమ్మ**

బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, మహిళల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే పూలను పూజిస్తూ ప్రకృతి పట్ల కృతజ్ఞతను చాటుకోవడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. ఇలాంటి సాంస్కృతిక వేడుకలు మహిళల మధ్య ఆత్మీయతను పెంపొందించడంతో పాటు సమాజంలో సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.మహిళలు కుటుంబానికి, సమాజానికి వెన్నెముకగా నిలుస్తారని, వారి సంక్షేమం, సంతోషం సమాజ అభివృద్ధికి ఎంతో కీలకమని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు.

**ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు**

ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. సంప్రదాయ పాటలు, ఆటపాటలు, పూల అలంకరణలతో కార్యక్రమం ఆహ్లాదకరంగా ముగిసింది.

# బొజ్జి గుప్ప- రామచంద్రుని పేట గ్రామాల మధ్య రోడ్డుకి ఇరువైపులా కమ్ముకున్న ముళ్ల పొదలు

**– నిత్యం ప్రాణాలతో చెలగాటం – తరచూ ప్రమాదాలకు ఆస్కారం**

**– ఆంధ్ర-తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో కంటికి కనిపించని అధికారుల పర్యవేక్షణ**





**దుమ్ముగూడెం అక్టోబర్ 16 (మనం న్యూస్ ):** ప్రజా రవాణాకు రక్షణగా ఉండాల్సిన రహదారి నేడు ప్రమాదాలకు నిలయంగా మారింది .అధికారుల నిర్లక్ష్యం,సరి హద్దుల పేరుతో మీ రాష్ట్ర భూభాగమేనని ఒకరు కాదు కాదు మీ రాష్ట్ర భూభాగమని ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల అధికారులు మధ్య సాగుతున్న నెపం నెట్టే ధోరణి మధ్య అమాయక వాహనదారులు, గ్రామస్తులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. దుమ్ముగూడెం మండల పరిధిలోని రామచంద్రునిపేట, బొజ్జిగుప్ప గ్రామాల మీదుగా వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా పిచ్చి చెట్లు, ముళ్ల పొదలు విపరీతంగా పెరిగిపోయాయి. రహదారిపైకి దట్టంగా చొచ్చుకురావడంతో రోడ్డు బాగా ఇరుకుగా మారిపోయింది. ముఖ్యంగా ప్రమాదకరమైన మలుపుల వద్ద ఎదురుగా ఏ వాహనం వస్తుందో కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆంధ్ర ప్రాంతం కూడా ఈ రహదారి గుండా కలిసి ఉండటంతో ఎటపాక నుంచి మారాయిగూడెం మీదుగా వెళ్లే వాహదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ముళ్లపదలు పిచ్చి మొక్కల కారణంగా రహదారి ఇరుకుగా మారి ఇప్పటికే ఈ రహదారి పై అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ మార్గం రెండు రాష్ట్రాలను కలుపుతూ ఉండటంతో కొంత భాగం తెలంగాణకు చెందిన రహదారిగా మరి కొంత భాగం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గా ఉండడంతో ఈ రాష్ట్రం వారు ఈ సమస్యను పట్టించుకుంటారని ఆ రాష్ట్రం వారు ఆ రాష్ట్రం వారు ఈ సమస్యను పరిష్కరిస్తారని ఈ రాష్ట్రం వారు అనుకుంటూ గురు రాష్ట్రాలు అధికారులు పట్టించుకోక పోవడంతో ఆ ముళ్ళపదలు పిచ్చి మొక్కలు కాస్త చిన్నపాటి అడవిని తలపిస్తున్న చందంగా మారాయి. ఇప్పటికైనా రెండు రాష్ట్రాల అధికారులు స్పందించి ఈ ముళ్లపదలు తుప్పలను తొలగించకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**గ్రామపంచాయతీకి సంబంధం లేదు అది ఆర్ అండ్ బి రహదారి.**

బొజ్జి గుప్ప రామచంద్రుని పేట గ్రామాల మధ్య గల ప్రధాన రహదారి గ్రామపంచాయతీ పరిధిలోకి రాదని రోడ్డును కమ్మేసిన పిచ్చి మొక్కలను పొదలను తొలగించాలంటే రోడ్లు భవనాల శాఖ అధికారులే ఆ పనులు చేపట్టాలని రామచంద్రుని పేట గ్రామపంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ ప్రాంతం ఆంధ్రప్రదేశ్ తెలంగాణ సరిహద్దు కావడంతో ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇది రోడ్డు భవనాల శాఖకు సంబంధించిన రహదారి అని తమకు ఎలాంటి సంబంధం లేదని తప్పకుండా కనీసం గ్రామాల మధ్య ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ములపదలు పిచ్చి మొక్కలు పొదలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని మండిపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి అధికారులు చొరవ తీసుకొని రోడ్డుకి ఇరువైపులు ఉన్నటువంటి చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

# పిఆర్టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా తూమాటి కృష్ణా రెడ్డి ఎన్నిక

## – శుభాకాంక్షలు తెలియజేసిన పిఆర్టీయు మధిర మండలశాఖ



**మధిర, అక్టోబర్ 16(మనం న్యూస్):** నల్గొండలో గురు శుక్రవారాలలో పిఆర్టీయు రాష్ట్ర కౌన్సిల్ సమావేశం అట్టహాసం గా జరిగింది.రాష్ట్ర కౌన్సిల్ సమావేశం లో రాష్ట్ర శాఖను ఏకగ్రీవం గా ఎన్నుకొనగా మధిర మండలం ఎంపీపీ ఎస్ నిధానపురం లో పనిచేస్తున్న సంఘ సీనియర్ సభ్యులు తూమాటి కృష్ణారెడ్డి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎంపిక కావటం పట్ల పిఆర్టీయు మధిర మండల శాఖ పక్షాన హర్షం వ్యక్తం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని మధిర మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి పోలే సుధాకర్ పేర్కొన్నారు.గత 25 సంవత్సరాలకు పైగా మధిర ప్రాంతం లో సంఘ అభివృద్ధికి కృష్ణా రెడ్డి కృషిచేశారని వారిని రాష్ట్ర బాధ్యులుగా ఎంపిక చేసినందుకు పిఆర్టీయు ఖమ్మం జిల్లా శాఖకు మధిర మండల శాఖ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్ బ్రహ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కొలగాని ప్రసాదరావు, బూసా కోటేశ్వరరావు, సిహెచ్ వి రవికుమార్ ,పిల్లి నరసింహారావు పురం సంగారావు,మధిర మండల బాధ్యులు కె శాంతబాబు , యం డి జమీర్ ,యం నాగేశ్వరరావు తెల్ల మేకల శ్రీనివాసరావు చెడే సతీష్ మల్లెల శ్రీనివాస్ ,డి శ్యామలరావు, టి అజయ్ కుమార్ ,వి వి యన్ రాజు కె నరసింహ చారి ,జి కేశవులు, కె కోటేశ్వరరావు, మహిళా బాధ్యులు పి డి పి జ్యోతి టి అనసూయ ,జి లలిత కుమారి తదితరులు ఉన్నారు.

# బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

## – మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు




**బోనకల్: అక్టోబర్ 16 (మనం న్యూస్):** నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బోనకల్ మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు కోరారు.మధిర నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించడంతో పాటు, కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కర్నాటి రామకోటేశ్వరరావు పిలుపునిచ్చారు. అలాగే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరై వార్తా కవరేజీ అందించాలని ప్రెస్ మిత్రులను కోరారు.కాంగ్రెస్ పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో పాల్గొని బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, మండల నాయకులు ఎర్రం శెట్టి సుబ్బారావు, పాసంగులపాటి కోటేశ్వర రావు, సర్పంచ్ బద్రు నాయక్, కందుల పాపారావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

## –ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం, అక్టోబర్ 16(మనం న్యూస్):** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ మరియు షార్ట్ ఫిల్మ్ కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీస్ కమిషనర్ వివరాలను వెల్లడిస్తూ (పోలీస్ ఫ్లాగ్ డే) పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఈనెల 21 నుంచి 31 వరకు వారోత్సవాలు నిర్వహించబడుతాయని. ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే ఇటీవల కాలంలో తీసిన (3) ఫోటోలు మరియు తక్కువ నిడివి (3 నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 23వ తేదీలోపు సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్, 10 ౸ 8 సైజ్ ఫోటోలను పెన్ డ్రైవ్లో సాఫ్ట్ కాపీ ని పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని పోలీస్ పి ఆర్ వో సెక్షన్ లో అందజేయాలన్నారు. ఈ పోటీలకు నామినేషన్లు పంపించే ఔత్సాహికులు అత్యవసర సమయాల్లో పోలీసులు స్పందన. ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2025 అక్టోబర్ నుండి ప్రస్తుత సంవత్సరం అక్టోబర్ నెల ఇప్పటివరకు) తీసిన మూడు ఫోటోలు, షార్ట్ ఫిల్మ్ మాత్రమే పంపించాల్సి వుంటుంది. మరిన్ని వివరాల కోసం 8712659256 నెంబర్ ద్వారా పీఆర్ఓ ను సంప్రదించాలన్నారు.

# కాంగ్రెస్ పాలనలో రైతులకు దగా..



**ఖమ్మం, అక్టోబర్ 16(మనం బ్యూరో) :** కాంగ్రెస్ పాలనలో రైతులు ఘోస పడుతున్నారని, రాష్ట్రంలో కృత్రిమ విద్యుత్, నీటి కొరత నెలకొందని ఎంఎల్సి తాతా మధుసూదన్, మాజీ ఎంఎల్ఏ సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. ఖమ్మంలోని తెలంగాణ భవన్లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడవకముందే రాష్ట్రంలో పరిపాలన పూర్తిగా గాడితప్పిందని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన గ్యారంటీ కార్డులు, రాసిచ్చిన బాండ్ పేపర్లకు విలువ లేకుండా పోయిందని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్, ఇంటింటికీ నల్లా నీళ్లు, మిషన్ కాకతీయతో చెరువులను నింపి వ్యవసాయాన్ని పండుగలా మార్చారని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాత రోజులు వచ్చాయని, బోర్ల దగ్గర బిందెలతో ఎదురుచూసే దుస్థితి, కరెంట్ లేక మోటార్లు, ట్రాన్స్ఫార్మర్లు కాలిపోయే విపత్కర పరిస్థితులు దాపురించాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 15,000 మెగావాట్లు ఉంటే, కేవలం 6,700 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తూ మిగతా లోటును పూడ్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి స్వయంగా పాల్గొన్న సమావేశాల్లోనే కరెంట్ పోయే పరిస్థితి ఉందంటే రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. గోదావరిలో 326.93 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉంటే, కేవలం 174.58 టీఎంసీలు మాత్రమే నిల్వ చేసి, 750 టీఎంసీల నీళ్లను ఆంధ్రప్రదేశ్కు వదిలేసి ఇక్కడి రైతులకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. కాళేశ్వరం ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా, కేసీఆర్కి పేరు వస్తుందనే దుగ్ధతో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని ఆరోపించారు. రెండో పంట వేయొద్దని రైతులకు ఉచిత సలహాలు ఇస్తున్న మంత్రులు.. తమ వ్యాపారాలు, కన్స్ట్రక్షన్ ప్రాజెక్టులు, 15 శాతం కమీషన్ల దందాలను ఆపుకుంటారా అని సూటిగా ప్రశ్నించారు. విత్తన కంపెనీలకు నోటీసులు ఇచ్చి రెండో పంటకు విత్తనాలు అమ్మొద్దని చెప్పడం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే దుర్మార్గమైన చర్య అని ధ్వజమెత్తారు.

మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ నల్ల బంగారం ఉన్న గడ్డ మన తెలంగాణ అని, కావలసినన్ని బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ కృత్రిమంగా కొరత సృష్టించి థర్మల్ పవర్ ఉత్పత్తిని తగ్గించారని విమర్శించారు. 2023–24లో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగితే, ప్రస్తుత ఏడాదిలో దాన్ని 58 మిలియన్ టన్నులకు ఎందుకు తగ్గించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణిని నిర్వీర్యం చేసి విదేశీ బొగ్గు దిగుమతి పేరిట భారీగా కమిషన్లు దండుకుంటున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి తన వైఫల్యాన్ని అధికారులపై నెట్టేస్తూ వారిని బెదిరించడం పరిపాలనా చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. అధికారులే మాట వినడం లేదని స్వయంగా ముఖ్యమంత్రే చేతులెత్తేస్తే ఇక ఈ రాష్ట్రంలో ప్రజల సమస్యలను ఎవరు పరిష్కరిస్తారని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ రంగానికి ఎలాంటి ఆటంకం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. నీరు, విద్యుత్ అందక ఎండిపోతున్న పంటలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని, కాలిపోయిన వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్ఫార్మర్లను ప్రభుత్వ ఖర్చుతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, బొగ్గు నిల్వలు, సరఫరా వివరాలపై ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. సింగరేణి టెండర్లు, బొగ్గు ఉత్పత్తి తగ్గింపు, విదేశీ బొగ్గు దిగుమతులపై సమగ్ర విచారణ జరిపించాలని, సింగరేణి వాటాల విక్రయం, ప్రైవేటీకరణ ఆలోచనలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన వైఖరి ప్రకటించాలని కోరారు. అధికారులను బలిపశువులను చేయడం ఆపి, ప్రణాళికా లోపాలను సరిదిద్దుకుని రైతులకు నిరంతర విద్యుత్ అందించే స్పష్టమైన గడువుతో కూడిన కార్యాచరణను ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో మండల నగర పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, నాయకులు బత్తుల మురళి, పగడాల నరేందర్, బలుసు మురళీకృష్ణ, యలమద్ది రవి, మహమ్మద్ రఫీ, దరిపెల్లి వీరబాబు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిబింబిస్తుందని కార్యక్రమంలో పేర్కొన్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర స్థానిక పూలతో బతుకమ్మలను పేర్చడం తెలంగాణ గ్రామీణ జీవన సౌందర్యానికి, స్థానిక జీవవైవిధ్యానికి నిదర్శనమని తెలిపారు. టీజీవో కార్యదర్శి మోదుగు వేలాద్రి మాట్లాడుతూ బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు, సామాజిక సమైక్యతకు ప్రతీక అని నిర్వాహకులు పేర్కొన్నారు. తరతరాలుగా మహిళలు తమ సంస్కృతి, సంప్రదాయాలను పాటల రూపంలో, ఆచారాల రూపంలో భావితరాలకు అందిస్తున్నారని, ఇటువంటి పండుగలు తెలంగాణ వారసత్వ సంపదను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. టీఎన్జీవో అధ్యక్షులు, జేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలనలో మహిళా ఉద్యోగులు నిర్వహిస్తున్న పాత్ర ఎంతో కీలకమైనదని, విధి నిర్వహణలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడంతో పాటు కుటుంబ, సామాజిక బాధ్యతలను కూడా సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్న మహిళల సేవలు అభినందనీయమని కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. ఉద్యోగినులు తమ దైనందిన విధుల ఒత్తిడిని పక్కనపెట్టి, ఒకే వేదికపై సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ సంబరాలను జరుపుకోవడం మహిళా సాధికారతకు, పరస్పర సహకారానికి, ఆత్మీయ బంధాలకు నిదర్శనంగా నిలిచిందని తెలిపారు. టీజీవో మహిళ అధ్యక్ష కార్యదర్శులు, జి.ఉషశ్రీ, పి సుధారాణి మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు మహిళా ఉద్యోగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు పరస్పర పరిచయాలను బలోపేతం చేస్తాయని, ఉద్యోగుల మధ్య స్నేహభావం, సహకారం, పరస్పర గౌరవం పెంపొందించడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఉద్యోగులందరూ కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఒకే కుటుంబ సభ్యులుగా కలిసిమెలిసి ఉండటం ద్వారా కార్యాలయాల్లో సానుకూల వాతావరణం ఏర్పడుతుందని, సమిష్టి కృషితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు. ఈ బతుకమ్మ సంబరాలలో కొనిదెన శ్రీనివాసరావు కార్యదర్శి టిఎన్జీవో, ప్రమీల డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్, నీరజ ప్రిన్సిపాల్, ప్రమీల అధ్యక్షులు జిజేఎల్ఏ, అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్, గంగవరపు నరేందర్ అసోసియేట్ అధ్యక్షులు, సూరంపల్లి రాంబాబు కోశాధికారి, ఎస్టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సైదులు రంజాన్ ఎస్టియు రాష్ట్ర అధ్యక్షులు, కొండపల్లి శేషు ప్రసాద్ అధ్యక్షులు హౌస్ బిల్డింగ్ సొసైటీ, డాక్టర్ పి. విజయ్ కుమార్ కార్యదర్శి, తాలూరి శ్రీకాంత్ టీఎన్జీవో నాయకులు, కే రుక్మారావు అధ్యక్షులు హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్, కోడి లింగయ్య గౌరవాధ్యక్షులు ఫోర్త్ క్లాస్ అసోసియేషన్, బిక్కు అధ్యక్షులు, కాంపాటి వెంకటరమణ కార్యదర్శి, పొట్ట పెంజర్ రామయ్య , షేక్ రంజాన్ అధ్యక్షులు యుటిఎఫ్ , గ్రామపంచాయతీ అసోసియేషన్ గురుమూర్తి, నాగులు మీరా, ఎస్ సుధాకర్ అధ్యక్షులు మున్సిపల్ అసోసియేషన్, బుర్రి వెంకటేశ్వర్లు మున్సిపల్ అసోసియేషన్, టీజీవో నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు, కరుణశ్రీ, జి.రమేష్, మోదు వెంకటేశ్వర్లు, డాక్టర్ బురుగు శ్రీనివాసు, కరుణశ్రీ,అరుణ జ్యోతి, రాంబాబు డిపిఓ, ఎస్కే గౌస్ పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులు సంప్రదాయ బతుకమ్మ పాటలతో, ఉత్సాహభరితమైన పాల్గొనికతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.